www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
PRGI.NO : APTEL /26/A4786
సంపుటి : 01 సంచిక : 36 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ గురువారం 16 - 07 - 2026
Published by EAST GODAVARI : Circulated by: East Godavari, Polavaram, Kakinada



బంజారాహిల్స్ తాజ్ హోటల్ కూల్చివేత! భారీ టవర్ నిర్మాణానికి సన్నాహాలు

# ఏపీలో ముందుగా మున్సిపల్ ఎన్నికలు

- వార్డుల పునర్విభజనపై వీడని సందిగ్ధత
- మున్సిపల్, నగర పంచాయతీల తర్వాతే గ్రామ పంచాయతీ ఎన్నికలు
- సెప్టెంబర్, అక్టోబర్‌లో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు
- కోర్టు కేసుల కారణంగా 23 పురపాలక సంస్థల్లో నిలిచిపోయిన పోరు




**అమరావతి :**
రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలుకానుంది. ముందుగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఆ తర్వాతే గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరపాలని భావిస్తోంది. ఈ మేరకు అధికార యంత్రాంగం ముందస్తు కసరత్తును ప్రారంభించింది.స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. అలాగే అసంపూర్తిగా నిలిచిపోయిన డివిజన్లు, వార్డుల పునర్విభజన ప్రక్రియను సమీక్షిస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ నివేదిక వచ్చేలోగా - మిగతా 2 లో

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం



- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ. 35 వేల కోట్ల బడ్జెట్‌తో పనులు చేపడతామని వెల్లడి
- రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం
- గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని విమర్శలు
- కేఎల్ రావు జయంతి, పట్టిసీమ జలహారతి కార్యక్రమంలో కీలక హామీలు

**అమరావతి :**
ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం - మిగతా 2 లో




## ప్రభుత్వ లాంఛనాలు వద్దు..

- ముద్రగడ కుటుంబం సంచలన నిర్ణయం
- ముద్రగడ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ఏపీ ప్రభుత్వ నిర్ణయం
- ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరించిన ముద్రగడ కుటుంబ సభ్యులు
- బతికున్నప్పుడు ఇబ్బందిపెట్టి ఇప్పుడీ గౌరవం వద్దని స్పష్టీకరణ

**అమరావతి :**
కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం (73) అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలన్న ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను ఆయన కుటుంబ సభ్యులు తిరస్కరించారు. బతికున్నప్పుడు ఆయన్ను అనేక విధాలుగా అవమానించారని, ఇప్పుడు అధికారిక గౌరవాలు, సానుభూతి తమకు అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం - మిగతా 2 లో

## అయోధ్య రామమందిరం సీఈఓ పోస్టుకు వెయ్యికి పైగా దరఖాస్తులు



- నోటిఫికేషన్ ఇచ్చిన రెండు రోజుల్లో వెయ్యికి పైగా అప్లికేషన్లు
- పరిపాలన, ఆర్థిక వ్యవహారాలను పటిష్టం చేసేందుకు ఈ నియామకం
- దరఖాస్తుదారుల్లో ఎక్కువగా రిటైర్డ్ బ్యూరోక్రాట్లు, ఉన్నతాధికారులు
- విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో ఈ కీలక నిర్ణయం

**ఢిల్లీ :**
అయోధ్య రామమందిరం నిర్వహణ కోసం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నూతనంగా ప్రకటించిన ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పోస్టుకు అనూహ్య స్పందన లభిస్తోంది. నోటిఫికేషన్ విడుదలైన రెండు రోజుల్లో వెయ్యికి పైగా దరఖాస్తులు ట్రస్టుకు అందడం విశేషం.ఆలయ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలను మరింత క్రమబద్ధీకరించి, వృత్తిపరమైన ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ట్రస్ట్ ఈ సీఈఓ పదవిని సృష్టించింది. దీని కోసం జులై 13వ తేదీన దరఖాస్తులను ఆహ్వానించగా, అభ్యర్థులలో అత్యధికులు విశ్రాంత బ్యూరోక్రాట్లు, మాజీ సీనియర్ పరిపాలనాధికారులు ఉండటం - మిగతా 2 లో



2 లో

## వేలంలో రికార్డు ధర పలికిన డైనోసార్ అస్థిపంజరం

- వేలంలో రికార్డు ధర పలికిన టీ-రెక్స్ అస్థిపంజరం
- సుమారు రూ. 482 కోట్లకు అమ్ముడైన 'గస్'
- ఇప్పటివరకు ఇదే అత్యంత ఖరీదైన డైనోసార్ శిలాజం
- ప్రైవేట్ సేకరణ వల్ల శాస్త్రీయ పరిశోధనలకు నష్టమని శాస్త్రవేత్తల ఆందోళన

## దేశంలో కనీవినీ ఎరుగని దొంగతనాలు

- దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న వింత దొంగతనాలు
- బీహార్‌లో 132 అడుగుల మొబైల్ టవర్, 60 అడుగుల వంతెన చోరీ
- హైదరాబాద్ నిజాం మ్యూజియంలో రూ. 50 కోట్లకు పైగా విలువైన వస్తువుల మాయం
- అయోధ్య రామాలయ హుండీలో రూ. 7 కోట్లకు పైగా గల్లంతు
- 2 కిలోమీటర్ల రోడ్డును దున్నేసి గోధుమ పంట వేసిన వైనం



**ఢిల్లీ :**
దేశంలో జరుగుతున్న కొన్ని దొంగతనాలు వింటుంటే ఆశ్చర్యం కలగక మానదు. చిన్న చిన్న వస్తువులు కాదు.. ఏకంగా సెల్ టవర్లు, రోడ్లు, చివరికి భారీ ఇనుప వంతెనలే మాయమవుతున్నాయి. బీహార్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ఇటీవల వెలుగు చూసిన కొన్ని భారీ చోరీలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. భద్రతా వ్యవస్థల డొల్లతనాన్ని, నేరస్థుల తెగింపును ఈ ఘటనలు కళ్లకు కడుతున్నాయి. - మిగతా 2 లో

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

- షాబాద్ ఘటనపై రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ లేఖ
- పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి
- పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన వైనం
- పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని పవన్ ఆరోపణ



**హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు. పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, - మిగతా 2 లో




## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

- తెలంగాణ, కర్ణాటక సహా నాలుగు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణ గడువు పొడిగింపు
- ఇంటింటి సర్వే కోసం బూత్ లెవల్ అధికారులకు అదనపు సమయం
- తెలంగాణలో ఆగస్టు 10న ముసాయిదా, అక్టోబర్ 12న తుది జాబితా
- కర్ణాటకలో ఆగస్టు 17న ముసాయిదా, అక్టోబర్ 19న తుది జాబితా విడుదల

**హైదరాబాద్ :**
తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర - మిగతా 2 లో

## 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ



- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేస్తామన్న మహేశ్ గౌడ్
- పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్ తో చర్చించామని వెల్లడి
- మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టీకరణ

**హైదరాబాద్ :**
రాష్ట్రంలో 50 నామినేటెడ్ పదవులను ఈ నెలలోనే భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ప్రస్తుతం మంచి పనితీరు కనబరిచిన వారిని రెన్యువల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్ - మిగతా 2 లో

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి మీ భవిష్యత్తుకు నాదీ హామీ

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందన్న సీఎం రేవంత్
- విద్యార్థులకు తెలంగాణ విద్యా కిట్ అందించనున్నామని వెల్లడి
- ప్రభుత్వ పాఠశాలపై ప్రత్యేకమైన దృష్టి పెట్టామన్న సీఎం
- మహబూబ్‌నగర్‌లో అమర రాజా తయారీ యూనిట్‌ను ప్రారంభించిన రేవంత్
- పరిశ్రమల్లో స్థానికులకే అత్యధిక ఉద్యోగాలు ఇవ్వాలని సూచన



**హైదరాబాద్ :**
గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడం కారణంగానే విద్యార్థులు చేరలేదని, అధికశాతం మంది ప్రైవేటు స్కూళ్ల వైపు మళ్లారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారు బడులపై ప్రత్యేక దృష్టిసారించామని, ఉపాధ్యాయుల సిబ్బంది సమస్యలు పరిష్కరించామని సీఎం తెలిపారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల హైస్కూల్‌కు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలతో ఫర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్-2.0లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రానికి 18 స్థానం వచ్చిందన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించామన్నారు.ఆగస్టు 15లోపు ఎడ్యుకేషన్ కిట్ ఇస్తాం : విద్యార్థులకు తెలంగాణ విద్యా కిట్ కింద 9 వస్తువులు అందించేందుకు నిర్ణయం తీసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రూ.1000 కోట్లతో 27,50,000 మంది విద్యార్థులకు ఆగస్టు 15వ తేదీలోపు ఈ కిట్‌ను ఇవ్వనున్నట్లుగా వెల్లడించారు. ఒక్కో విద్యార్థి చదువు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.8లక్షలు ఖర్చు చేస్తుందని వివరించారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఆదర్శమూర్తులకు ఆదరణ ఉందా?

అవినీతికి లొంగకుండా ఉద్యోగం చేసిన అధికారులు, ప్రజల హక్కుల కోసం పోరాడిన ఉద్యమకారులు, సత్యం కోసం జీవితాన్ని పణంగా పెట్టిన పాత్రికేయులు, కళను సంపాదనకు గాక, సమాజ చైతన్యం కోసం ఉపయోగించిన కళాకరులు, గ్రామం బాగుపడాలని తమ భూములు త్యాగం చేసిన నాయకులు... ఇలా ఎంతో మంది ఆదర్శవంతులు ఉన్నారు. వాళ్లంతా 'మనిషి మారితే, సమాజం మారుతుంది' అని నమ్మారు. కానీ, సమాజం వాళ్లను తిరిగి 'మారకపోతే నువ్వే నష్టపోతావు' అని బెదిరిస్తోంది. మన విలువలలో వచ్చిన భయంకరమైన మార్పు ఇది.ఒకప్పుడు పిల్లలకు 'నిజాయితీగా బతకాలి!' అని చెప్పేవారు. మనం ఇప్పుడు విజయాన్ని... ఎంత సంపాదించాడు? ఎంత పెద్ద ఇల్లు కట్టాడు? ఎన్ని కార్లు ఉన్నాయి? అనే ప్రాతిపదికలమీద కొలుస్తున్నాం. ఎంతమంది జీవితాలను మార్చాడు? ఎంతమందికి న్యాయం చేశాడు? ఉన్నత ఆదర్శాలతో ఎంతమందికి మార్గదర్శకం అయ్యాడు? అనే ప్రశ్నలు అడగడమే మానేశాం.ప్రతీ తరం తమ ముందుతరాల ఆదర్శవాదులను ప్రశంసిస్తుంది. తమ కాలంలో ఉన్నవారిని మాత్రం హేళన చేస్తుంది. బతికున్నప్పుడు వారిని 'పిచ్చివాడు' అంటుంది. చనిపోయాక 'మహానుభావుడు' అంటుంది. ఒక ఆదర్శవాదిని ఈ సమాజం అసౌకర్యంగా భావిస్తోంది. ఎందుకంటే, అతను మన తప్పులను గుర్తు చేస్తాడు, రాజీలను ప్రశ్నిస్తాడు, అతని నిజాయితీ మన అబద్ధాలను బట్టబయలు చేస్తుంది. అందుకే అందరం కలిసి అతడిని ఒంటరివాడిని చేస్తున్నాం. మనం మారకపోగా అతనినే మార్చాలనుకుంటున్నాం. లంచం ఇచ్చేదీ, నిజాయితీపరుడిని చూసి 'ఇతనితో కష్టం' అనేదీ, సిద్ధాంతాలున్న వారిని 'ప్రాక్టికల్ కాదు' అనేదీ, స్వార్థపరులను గెలిపించి, సేవ చేసేవారిని వదిలేస్తున్నదీ మనమే! నీడనిచ్చి, ఆకలి తీర్చి, ప్రాణాలను నిలబెట్టే చెట్టును నరికేది మనిషే. ఆదర్శవాదుల కథ కూడా అంతే.ఒక దేశాన్ని నిలబెట్టేవి విలువలే. ఈ రోజు మన పిల్లలు 'నిజాయితీగా ఉంటే ఉపయోగమేమిటి?' అని అడుగుతున్నారు. పిల్లలు మన చేతలను చూస్తారు. మనం గౌరవించేది సంపదనే అయితే, వాళ్లు సంపదనే వెంబడిస్తారు. మనం గౌరవించేది విలువలైతే, వాళ్లూ విలువలను కాపాడతారు. లోకోపకారులు, పరోపకారులు ఓడిపోతుంటే చూస్తూ కూడా ఎందుకు మౌనంగా ఉన్నామనే ప్రశ్నకు మనవద్ద సమాధానం ఉండితీరాలి.



## ప్రభుత్వ లాంఛనాలు వద్దు..

**మొదటిపేజీ తరువాయి -** రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.వివరాల్లోకి వెళితే.. ముద్రగడ పద్మనాభం మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అయితే, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ముద్రగడ కుటుంబం సున్నితంగా తిరస్కరించింది.కాకినాడ జిల్లా కిర్లంపూడిలో వైసీపీ నేత జక్కంపూడి రాజా మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. "ముద్రగడ గారు బతికున్నప్పుడు ఆయన్ను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారు. ఇప్పుడు మరణించాక మొసలి కన్నీరు కార్చాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ లాంఛనాలు వద్దని ఆయన కుటుంబ సభ్యులు తేల్చిచెప్పారు" అని రాజా తెలిపారు. ముద్రగడ అధికారం కోసం కాకుండా ప్రజా సమస్యల కోసం పోరాడిన గొప్ప నాయకుడని ఆయన కొనియాడారు. దీంతో, ప్రభుత్వ లాంఛనాలు లేకుండానే కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ముద్రగడ అంతిమ సంస్కారాలు జరగనున్నాయి.

## అయోధ్య రామమందిరం సీఈఓ పోస్టుకు వెయ్యికి పైగా దరఖాస్తులు

**మొదటిపేజీ తరువాయి -** గమనార్హం. జూలై 18 సాయంత్రం 4 గంటల వరకు గడువు ఉన్నందున, దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.దరఖాస్తుల పరిశీలన నిమిత్తం ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ఎంపిక కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఈ పరిశీలన ప్రక్రియ జులై 19 నుంచి ప్రారంభం కానుంది. గడువు ముగిసిన వెంటనే షార్ట్‌లిస్ట్ చేయడం, ఇంటర్వ్యూల నిర్వహణ వంటి ప్రక్రియలు చేపడతారు. జూలై 22న జరగనున్న ట్రస్ట్ సమావేశంలో సీఈఓ నియామకంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.ఆలయ విరాళాల దారిమళ్లింపునకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ కొనసాగుతున్న తరుణంలో ఈ నియామక ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కేసులో ఇప్పటికే కొందరు సిబ్బందిని అరెస్ట్ చేయగా, ఉత్తరప్రదేశ్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరుపుతోంది. ఈ క్రమంలోనే ఆలయ కార్యకలాపాల్లో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడామే లక్ష్యంగా సీఈఓను నియమిస్తున్నట్లు తెలుస్తోంది. మాజీ ఐపీఎస్ అధికారి అమితాబ్ ఠాకూర్ కూడా ఈ పదవికి దరఖాస్తు చేసినట్లు బహిరంగంగా ప్రకటించారు.ఎంపికైన సీఈవో పనితీరు ఆధారంగా ఆ తర్వాత పొడిగింపు ఉంటుంది. ట్రస్ట్ నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేయడం, ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించడం మరియు ఆలయ కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటం వంటివి నూతన సీఈఓ ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి.

## వేలంలో రికార్డు ధర పలికిన డైనోసార్ అస్థిపంజరం


**మొదటిపేజీ తరువాయి -** వేలంలో ఓ డైనోసార్ అస్థిపంజరం సరికొత్త చరిత్ర సృష్టించింది. 'గస్' అనే ముద్దుపేరున్న టైరనోసారస్ రెక్స్ (టీ-రెక్స్) అస్థిపంజరం న్యూయార్క్‌లోని సోత్‌బేస్ వేలం కేంద్రంలో రికార్డు స్థాయిలో 50.1 మిలియన్ డాలర్లకు (సుమారు రూ. 482 కోట్లు) అమ్ముడుపోయింది. దీంతో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన డైనోసార్ శిలాజంగా 'గస్' నిలిచింది. మంగళవారం జరిగిన ఈ వేలంలో, కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే ఏడుగురు పోటీదారుల మధ్య హోరాహోరీగా బిడ్డింగ్ సాగింది. ఈ అస్థిపంజరాన్ని 2021లో సౌత్ డకోటాలోని ఒక పశువుల క్షేత్రంలో కనుగొన్నారు. ఇందులో 183 శిలాజ ఎముకలు మాత్రమే లభ్యమాయ్యాయి. ఇది డైనోసార్ దేహంలో సుమారు 63 శాతం మాత్రమే. దాదాపు 38 అడుగుల పొడవున్న ఈ డైనోసార్, సుమారు 6.6 నుంచి 7.2 కోట్ల సంవత్సరాల క్రితం జీవించిందని శాస్త్రవేత్తల అంచనా వేస్తున్నారు. 2024లో 44.6 మిలియన్ డాలర్లకు అమ్ముడైన 'అపెక్స్' అనే స్టెగోసారస్ అస్థిపంజరం పేరిట ఉన్న రికార్డును తాజాగా 'గస్' అధిగమించింది.అమెరికా చట్టాల ప్రకారం, ప్రైవేట్ భూముల్లో లభించిన శిలాజాలను ప్రైవేట్ ఆస్తిగానే పరిగణిస్తారు. అందుకే వాటిని వాణిజ్యపరంగా విక్రయించడం సాధ్యమవుతోంది. అయితే, ఈ విక్రయంపై పురాజీవ శాస్త్రవేత్తలలో మరోసారి చర్చ మొదలైంది. ఇలాంటి అరుదైన శిలాజాలు మ్యూజియంలకు కాకుండా ప్రైవేట్ వ్యక్తుల సేకరణలకు పరిమితమైతే, భవిష్యత్తులో శాస్త్రీయ పరిశోధనలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, గుర్తుతెలియని వ్యక్తి కొనుగోలు చేసిన ఈ అస్థిపంజరాన్ని భవిష్యత్తులో ఎక్కడ ప్రదర్శిస్తారనే వివరాలను ప్రస్తుతానికి గోప్యంగా ఉంచారు.

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

**మొదటిపేజీ తరువాయి -** బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో దర్యాప్తులో నిర్దిష్ట కాలపరిమితిని పాటించాలని, సాక్ష్యాధారాలు తారుమారుకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.సదరు కేసులో నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం, అదే సమయంలో బాధితుల కుటుంబానికి తగిన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమవడంపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పోక్సో కేసులకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

# ఏపీలో ముందుగా మున్సిపల్ ఎన్నికలు

**మొదటిపేజీ తరువాయి -** ముందస్తు ఏర్పాట్లు అన్నీ పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ముగిసిన వెంటనే సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రకటించారు.రాష్ట్రంలో మొత్తం 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలు ఉన్నాయి. కోర్టు కేసుల కారణంగా 2021లో కేవలం వంద చోట్లే రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించారు. మిగిలిన 23 పుర, నగరపాలక సంస్థల్లో సమీపంలోని 112 గ్రామ పంచాయతీలను విలీనం చేయడంపై అప్పట్లో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు కేసుల పెండింగ్ కారణంగా ఆ 23 చోట్ల ఎన్నికలు ఆగిపోయాయి. ఇప్పుడు ఈ కేసుల పరిష్కారంపై అడ్వొకేట్ జనరల్, ఇతర న్యాయ నిపుణులతో అధికారులు విస్తృతంగా చర్చిస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2022లో కాకినాడ నగరపాలక సంస్థలో రెండు డివిజన్లను మినహాయించి ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 87 చోట్ల పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది మార్చి 17వ తేదీతోనే ముగిసింది. మరో 13 చోట్ల




నవంబరులో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వానికి కీలక లేఖ రాసింది. ఎన్నికలు కేవలం 100 చోట్ల మాత్రమే నిర్వహించాలా? లేక మొత్తం 123 చోట్లా నిర్వహణకు ముందుకెళ్లాలా? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని పురపాలక శాఖను కోరింది.పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డుల పునర్విభజన చివరి దశకు చేరుకుని నిలిచిపోయింది. జనాభా ఆధారంగా వీటి సంఖ్యను 3,916 నుంచి 4,843కి పెంచాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే విశాఖపట్నం, మచిలీపట్నాల్లో వార్డుల పునర్విభజనను సవాల్ చేస్తూ కొందరు హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు వేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు, పునర్విభజనపై స్టే ఇచ్చి కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి సూచించింది. ఆ తర్వాత ఇదే అంశంపై మరికొన్ని కేసులు రావడంతో వార్డుల పెంపు ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది.వచ్చే రెండు, మూడు నెలల్లో ఎన్నికలను నిర్వహించాలంటే ప్రభుత్వం ముందు ప్రధానంగా రెండు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. పునర్విభజన ప్రక్రియను పక్కన పెట్టి పాత డివిజన్లు, వార్డులతోనే ఎన్నికలకు వెళ్లాలి. లేదంటే హైకోర్టులో కేసులు పరిష్కారమయ్యే దాకా వేచి చూడాలి. ఈ విషయాన్ని అధికారులు ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, సాధ్యమైనంత త్వరగా మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే ఓ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి అధికారులకు ప్రభుత్వం తుది స్పష్టత ఇవ్వనుంది.

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం

**మొదటిపేజీ తరువాయి -** చేయడం రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి వేళ, పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన 'జలహారతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం చూపారంటూ గణాంకాలతో సహా ఎండగట్టారు. ఒక వ్యక్తి ప్రాధాన్యతల కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని తీవ్రంగా ఆరోపించారు.

### విమర్శలనే కాదు.. వారి మోసాన్ని మ్యూజియంలో పెడతా

గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. "వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీక అయిన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పూయని దుస్థితి ఉండేదని, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు.తాము ఎంతో కష్టపడి పూర్తి చేసిన పట్టిసీమ ప్రాజెక్టును 'వట్టిసీమ', 'దండగ' అని ఆనాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన వారే, అధికారంలోకి వచ్చాక దాని విలువను గుర్తించలేకపోయారని అన్నారు. "నేను ఆ రోజు వారి విమర్శలకు భయపడి ఉంటే, ఈ పదేళ్లలో కృష్ణా డెల్టా పరిస్థితి ఏమై ఉండేదో ఒక్కసారి ఆలోచించండి. పట్టిసీమ ద్వారా గడిచిన పదేళ్లలో 450 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణాకు తరలించి 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

### 36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు

విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని జల సమృద్ధంగా మార్చేందుకు తమ ప్రభుత్వ బృహత్ ప్రణాళికను చంద్రబాబు ఆవిష్కరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు."రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇప్పటికే 37 సార్లు భౌతికంగా, 37 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించాను. పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. తాను 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో పాటు వంశధార-నాగావళి-గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం తన చిరకాల స్వప్నమని, దానిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని పునరుద్ఘాటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల వంటి అనేక ప్రాజెక్టుల పూర్తికి నిర్దిష్ట తేదీలను ప్రకటించి, ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటుకున్నారు.

### మహనీయుల స్ఫూర్తితో ముందుకు

ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్, శివరామకృష్ణయ్య, నందమూరి తారక రామారావు వంటి మహనీయులు సాగునీటి రంగానికి చేసిన సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. వారి దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచిందన్నారు. మంచి పనులు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని, చెడును ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని హితవు పలికారు. తాము అధికారంలోకి వచ్చాక ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్లను యుద్ధప్రాతిపదికన మార్పించామని, నిర్వహణ లోపాలను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్ రావు కుమారుడు విజయరావు కోరిన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణాన్ని కూడా తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

# దేశంలో కనీవినీ ఎరుగని దొంగతనాలు

**మొదటిపేజీ తరువాయి -** గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా జరుగుతున్న ఈ వింత దొంగతనాలు పాలనాపరమైన లోపాలను ఎత్తిచూపుతున్నాయి.

### బీహార్‌లో ఒకదాని తర్వాత ఒకటి..

వింత దొంగతనాల విషయానికి వస్తే బీహార్ తరచూ వార్తల్లో నిలుస్తోంది. ఇటీవల బక్సర్ జిల్లాలోని డుమ్రాన్ ప్రాంతంలో ఏకంగా 132 అడుగుల పొడవైన మొబైల్ టవర్‌తో పాటు, దానికి అనుబంధంగా ఉన్న 15 కేవీఏ జనరేటర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. జీటీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి చెందిన ఈ టవర్ కొన్నేళ్లుగా పనిచేయడం లేదు. మరమ్మతుల కోసం కంపెనీ సిబ్బంది అక్కడికి వెళ్లినప్పుడు టవర్ కనిపించకపోవడంతో ఈ విషయం బయటపడింది. నివాస ప్రాంతంలో ఉన్నప్పటికీ అంత పెద్ద టవర్‌ను ఎలా దొంగిలించారనేది అంతుచిక్కడం లేదు.ఇదే తరహాలో 2022లో రోహ్‌తాస్ జిల్లాలో జరిగిన ఓ భారీ చోరీ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆరా-సోన్ కాలువపై ఉన్న 45 ఏళ్ల నాటి, 60 అడుగుల పొడవు, 500 టన్నుల బరువున్న ఇనుప రైల్వే వంతెనను దొంగలు ముక్కలుగా కోసి పట్టుకుపోయారు. తాము ప్రభుత్వ నీటిపారుదల శాఖ అధికారులమని స్థానికులను నమ్మించి, పట్టపగలే మూడు రోజుల పాటు గ్యాస్ కట్టర్లతో వంతెనను తొలగించడం గమనార్హం.ఇక బంకా జిల్లాలో మరో అడుగు ముందుకేశారు. ఖరౌనీ, ఖదంపూర్ గ్రామాలను కలిపే 2 కిలోమీటర్ల కాంక్రీట్ రోడ్డును రాత్రికి రాత్రే మాయం చేశారు. కొందరు స్థానిక గూండాలు ట్రాక్టర్‌తో రోడ్డును పూర్తిగా దున్నేసి, ఆ స్థలంలో గోధుమ పంట వేయడం స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది.

### హైదరాబాద్ నిజాం మ్యూజియం కేసు

సాంస్కృతిక సంపద చోరీల విషయానికొస్తే హైదరాబాద్ నిజాం మ్యూజియం కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 2018 సెప్టెంబర్‌లో పురానీ హవేలీలోని మ్యూజియంలోకి చొరబడిన ఇద్దరు దొంగలు, దాదాపు 7 మిలియన్ డాలర్ల (అప్పట్లో రూ. 50 కోట్లకు పైగా) విలువైన పురాతన వస్తువులను అపహరించారు. వాటిలో 2 కిలోల బంగారు టిఫిన్ బాక్స్, బంగారు కప్పు సాసర్, వజ్రాలు పొదిగిన స్పూన్ వంటివి ఉన్నాయి. అయితే, పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి దొంగలను అరెస్ట్ చేశారు. దొంగిలించిన టిఫిన్ బాక్సులోనే ఓ దొంగ భోజనం చేయడం అప్పట్లో సంచలనం రేపింది. ఈ కేసులో నిందితులకు 2020లో రెండేళ్ల జైలు శిక్ష పడింది.

### అయోధ్యలో విరాళాల గల్లంతు

మరోవైపు ఆధ్యాత్మిక కేంద్రాల్లోనూ భారీగా నిధులు గల్లంతయ్యాయి. 2024లో అయోధ్యలో రామమందిరం ప్రారంభమైన తర్వాత శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలోని విరాళాల పెట్టెల నుంచి రూ. 7 కోట్లకు పైగా సొమ్ము మాయమైనట్లు గుర్తించారు. ప్రతిరోజూ బ్యాంకులో జమ చేసే మొత్తంలో భారీగా తగ్గుదల కనిపించడంతో ఈ విషయం బయటపడింది. రోజుకు రూ. 6 నుంచి 8 లక్షల వరకు పక్కదారి పట్టినట్లు అధికారులు అంచనా వేశారు. ఈ ఘటనపై ప్రత్యేక బృందం ఎనిమిది మందిపై విచారణ జరుపుతోంది.ఈ ఘటనలన్నీ వేర్వేరు సమయాల్లో, వేర్వేరు ప్రాంతాల్లో జరిగినప్పటికీ, వీటన్నింటిలో ఓ ఉమ్మడి అంశం కనిపిస్తుంది. పర్యవేక్షణ లోపం, అధికారుల నిర్లక్ష్యం, నేరస్థుల్లో పెరిగిపోయిన ధైర్యం వీటికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ఈ ఘటనలు కేవలం ఆర్థిక నష్టాన్నే కాకుండా, ప్రభుత్వ వ్యవస్థలు, భద్రతపై ప్రజలకు నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. కమ్యూనిటీ నిఘా, కఠినమైన చట్టాల అమలు ద్వారానే ఇలాంటి భారీ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి, మీ భవిష్యత్తుకు నాదీ హామీ

**మొదటిపేజీ తరువాయి -** ఒకప్పుడు స్టడీటూర్‌కు ఐఏఎస్‌లు వెళ్లేవారని, ఈ ఏడాది టీచర్లను స్టడీటూర్‌కు సింగపూర్, సౌత్ కొరియా లాంటి దేశాలకు పంపించామని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు."ఒక్కో విద్యార్థిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.1.08లక్షలు ఖర్చు చేస్తోంది. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలి. విద్యలో రాణించకపోతే క్రీడల్లో రాణించాలి. క్రీడాకారులు మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి. విద్యార్థులు మైదానాల్లోనూ పోటీపడాలి. మీ భవిష్యత్‌కు నాదీ హామీ. క్రీడల్లో రాణించేవారిని ఉన్నతస్థాయిలో నిలిపే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతామన్నముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.అంతకుముందు మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమరరాజ సంస్థ చేపట్టిన 'సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ యూనిట్'ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి కోసం గత ప్రభుత్వాలు చేసిన పాలసీలను మరింత మెరుగుపరిచామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇండస్ట్రీ, టూరిజం, మెడికల్ పాలసీలతో రాష్ట్ర జీఎస్‌డీపీ పెంచుతున్నామని పేర్కొన్నారు.అమరరాజా సంస్థ మహబూబ్‌నగర్‌లో పెట్టడం ఆ జిల్లా ప్రజలకు గర్వకారణమని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ సంస్థతో పోటీ పడేది దేశంలో ఏదీ లేదన్నారు. చైనాతో పోటీ పడే అమరరాజా సంస్థకు సంపూర్ణంగా సహకరిస్తున్నామని వివరించారు. వికసిత్ భారత్ 2047 కల్లా 3 ట్రిలియన్ డాలర్లకు చేరడమే లక్ష్యమన్న సీఎం, అమర రాజ సంస్థ తన లక్ష్యానికి సహకరిస్తుందని వివరించారు. అమరరాజా నూతన యూనిట్ ఏర్పాటుకు రైతులు భూములు ఇచ్చారని వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. వాహన కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాలు ఉండాలని, ఈవీలకు బ్యాటరీలే కీలకమని రేవంత్ రెడ్డి తెలిపారు. కాలుష్యంలేని దేశంగా తీర్చిదిద్దాలంటే ఈవీ వాహనాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వివిధ రంగాల్లో కొత్త పాలసీలను రూపొందించామన్నారు. దేశంలో 2.5 శాతం జనాభా ఉన్న తెలంగాణ నుంచి 5 శాతం జీడీపీ అందిస్తోందన్నారు.కల్వకుర్తి, బీమ, నెట్టెంపాడు, పాలమూరు రంగారెడ్డి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు పూర్తి చేసుకునేందుకు, సమస్యలు పరిష్కరించుకునేందుకు పక్క రాష్ట్రాలతో చర్చలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. త్వరలోనే జిల్లా రైతులకు శుభవార్త వినిపించబోతున్నామన్నారు. 90 టీఎంసీలకు సంబంధించి కేంద్రాన్ని ఒప్పించే విధంగా ముందుకు వెళ్తున్నామన్న ఆయన, త్వరలోనే కృష్ణానది పరివాహక ప్రాంతంలో సంపూర్ణ అనుమతులు తీసుకొస్తామని చెప్పారు. పరిశ్రమలకు అనుకూల వాతావరణం సృష్టించి, పెట్టుబడులు ఆహ్వానించి జిల్లా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

**మొదటిపేజీ తరువాయి -** ఎన్నికల సంఘం పొడిగించింది. ఎన్యుమరేటర్లు వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని స్పష్టం చేసింది.తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఇదే తేదీలోగా పూర్తి చేయనున్నారు.




తెలంగాణలో ఆగస్టు 10న, పంజాబ్‌లో ఆగస్టు 13న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు తెలంగాణలో సెప్టెంబర్ 9 వరకు, పంజాబ్‌లో సెప్టెంబర్ 12 వరకు అవకాశం కల్పించారు. అనంతరం, అక్టోబర్ 12న రెండు రాష్ట్రాల్లోనూ తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో జూన్ 30న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 8 వరకు పొడిగించారు. ఆగస్టు 17న ముసాయిదా జాబితాను విడుదల చేసి, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అన్ని ప్రక్రియలను పూర్తి చేసి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను వెల్లడిస్తారు.బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) చేపట్టే ఇంటింటి సర్వేలో భాగంగా నకిలీ ఓట్లు తొలగింపు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు వంటి సవరణలు చేపడతారు. సవరించిన గడువులను కచ్చితంగా పాటించాలని ఆయా రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

## 50 నామినేటెడ్ పదవులు ఈ నెలలోనే భర్తీ



**మొదటిపేజీ తరువాయి -** రెడ్డితో భేటీ అవుతామన్నారు.మండల కమిటీలలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరితో కూడా మాట్లాడానని మహేశ్ తెలిపారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టుగా రేణుక తనతో చెప్పారని అన్నారు. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు అని తెలిపారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికీ గాంధీభవన్ కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

# నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు,జులై 15 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.వీరేష్** నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం పటాన్చెరులోని ఒక ప్రైవేటు వేదికపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 18న హైదరాబాద్లో నిర్వహించనున్న యువ సంగ్రామ సదస్సుకు పటాన్చెరు నియోజకవర్గం నుండి ఐదు వేల మంది యువత హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు.





**మోసపూరిత హామీలు:**

ఎన్నికల సమయంలో సరూర్ నగర్ వేదికగా ప్రియాంక గాంధీ ప్రకటించిన నిరుద్యోగ డిక్లరేషన్ను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆయన ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా, నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ఉపాధి కల్పిస్తామని నమ్మించి, అధికారంలోకి వచ్చాక యువతను, రైతులను, మహిళలను మోసం చేసిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్మెంట్, ఉద్యోగ నియామకాలలో జాప్యం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి:**

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రత్యేక దిశానిర్దేశం చేశారు. పటాన్చెరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# శేరిలింగంపల్లిలో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై కీలక సమీక్ష


**ప్రతి అర్హుడికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం:**

**శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పిలుపు**

**మారబోయిన రవి యాదవ్ ఆధ్వర్యంలో బూత్ స్థాయి ప్రతినిధుల సమావేశం**





**శేరిలింగంపల్లి,జులై 15 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.ఈరన్న** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి విభాగాలలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై బుధవారం ఒక సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. శేరిలింగంపల్లి సీనియర్ భారత రాష్ట్ర సమితి నాయకులు మారబోయిన రవి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గ బూత్ స్థాయి ప్రతినిధులు, ముఖ్య నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశానికి కూకట్పల్లి శాసనసభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ బాధ్యులు మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. బాధ్యతాయుతంగా పనిచేయాలి: శాసనసభ్యులు మాధవరం సమావేశంలో శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఓటరు నమోదు, సవరణల ప్రక్రియను అత్యంత బాధ్యతతో నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. "ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత విలువైనది. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా బూత్ స్థాయి ప్రతినిధులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలి.క్షేత్రస్థాయిలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా పార్టీ శ్రేణులు చొరవ చూపాలి.మాధవరం కృష్ణారావు తరలివచ్చిన శ్రేణులు ఈ సమీక్షా సమావేశంలో క్షేత్రస్థాయిలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో: గచ్చిబౌలి మాజీ నగర సేవకులు కొమిరిశెట్టి సాయిబాబా మాజీ నగర సేవకులు మాధవరం రంగారావు నాయకులు నవతా రెడ్డి, విజయ్ రెడ్డి, నరేందర్ యాదవ్ వీరితో పాటు భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రేమనగర్ బి-బ్లాక్ సమస్యలను పరిశీలించిన రవి కుమార్ యాదవ్

**డ్రైనేజీ సమస్యతో బోర్లలోకి మురుగునీరు..**

**100 కుటుంబాల ఆవేదన**







**కొండాపూర్,జులై 15 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.ఈరన్న** కొండాపూర్ డివిజన్ న్యూ ఆఫీస్ పెట్ ప్రేమ్నగర్ బి-బ్లాక్లో డ్రైనేజీ సమస్య కారణంగా తీవ్ర దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులను శేరిలింగంపల్లి బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలోకి కాంట్రాక్టర్లు డ్రైనేజీ లైన్లు కలిపేటప్పుడు చేసిన తప్పిదాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. పైభాగం నుండి వచ్చే డ్రైనేజీ లైన్ను రైల్వే ట్రాక్ ఖాళీ స్థలంలోకి వదిలేయడం వల్ల అక్కడ నాలుగు నుండి ఐదు అడుగుల మేర మురుగునీరు నిలిచిపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని ప్రభావంతో స్థానిక బోర్ల నుండి కూడా మురుగునీరు వస్తోందని, ఫలితంగా కాలనీవాసులు తాగేందుకు, వాడుకునేందుకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పట్టించుకోని అధికారులు.. పొంచి ఉన్న విషజ్వరాలు: నిలిచిపోయిన మురుగునీటి వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయి, పిల్లలు విషజ్వరాల బారిన పడుతున్నారని రవికుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. వర్షం వచ్చినా రాకున్నా ప్రతిరోజూ డ్రైనేజీ నీరు రోడ్లపై పొంగిపొర్లుతుండటంతో దాదాపు 100 కుటుంబాలు నరకయాతన అనుభవిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యపై కాలనీవాసులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్లకు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమయ్యేలా తాను వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుంటానని రవికుమార్ యాదవ్ స్థానిక ప్రజలకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజు, రామిరెడ్డి, శంకర్, సన్నీ గౌడ్, మల్లేష్తో పాటు కాలనీ మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

## యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలి: ఆదర్శ్ రెడ్డి



**పటాన్చెరు,జులై 15 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.వీరేష్** రానున్న జూలై 18న సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో బీఆర్ఎస్ పార్టీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న "యువ సంగ్రామ సదస్సు"ను దిగ్విజయం చేయాలని నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ బాధ్యులు ఆదర్శ్ రెడ్డి పిలుపునిచ్చారు. పటాన్చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ "యూత్ డిక్లరేషన్" పేరుతో యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిరుద్యోగులను నట్టేట ముంచిందని ఆదర్శ్ రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న మోసాలను, వైఫల్యాలను ఎండగట్టేందుకే ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి బూత్ నుండి కనీసం పది మంది యువకులు ఈ సదస్సుకు తరలిరావాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో మొత్తం 422 బూత్లు ఉన్నాయని, యువత తమ హక్కుల సాధన కోసం పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి తమ నిరసనను తెలపాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో స్థానిక పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాల యాజమాన్యాలు డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి..



**గిద్దలూరు,జులై 15 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి మల్లాపురం సాగర్ పాఠశాల యాజమాన్యాలు మరియు డ్రైవర్లు విద్యార్థుల భద్రతా విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని డిఎస్పి నాగరాజు అన్నారు.గిద్దలూరు లోని స్థానిక ప్రైవేట్ పాఠశాలల్లోని బస్సులను డీఎస్పీ నాగరాజు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డిఎస్పీ మరియు స్థానిక పోలీసులు పాఠశాల వాహనాల కండిషను బ్రేకులు,అత్యవసర ద్వారాలు,ఫస్ట్ ఎయిడ్ కిట్లు మరియు అగ్నిమాపక పరికరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పాఠశాల యాజమాన్యాలకు, డ్రైవర్లకు సూచనలు ఇచ్చారు. విద్యార్థుల పట్ల వారి జాగ్రత్త విషయంలో నిర్లక్ష్యం వహించ వద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వివాదాస్పద ఫ్లెక్సీలు ముద్రించ వద్దు: డీఎస్పీ నాగరాజు



**గిద్దలూరు,జులై 15 .అక్షర టైమ్స్ :** ప్రతినిధి మల్లాపురం సాగర్ ప్రజలకు శాంతి భద్రతలకు విగాతం కలిగించే ఫ్లెక్సీ లను ముద్రించ వద్దు అని డీఎస్పీ నాగరాజు సూచించారు.బుధవారం నాడు గిద్దలూరు లోని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫ్లెక్సీ మరియు ప్రింటింగ్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి నాగరాజు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రజల శాంతిభద్రతకు విగాథం కలిగించే వివాదాస్పతమైన బ్యానర్లు ఫ్లెక్సీలు పేపర్లు ముద్రించవద్దని తెలిపారు.ముద్రించే ముందు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, అభ్యంతరకరమైన వాక్యాలు ఉన్నట్లయితే వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ముద్రించవద్దని ఆదేశించారు.ఈ మార్గదర్శకాలు ఎస్పీ నుంచి జారీ చేసినవని కాబట్టి ప్రతి ఒక్కరు తప్పక పాటించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గిద్దలూరు ప్రాంతానికి చెందిన ప్రింటింగ్ మరియు ఫ్లెక్సీ యజమానులు పాల్గొన్నారు.

## కర్ణాటకలో కేబినెట్ విస్తరణకు కౌంట్డౌన్!

# సీఎం దిల్లీ పర్యటనతో ఊపందుకున్న చర్చలు



దిల్లీకి సీఎం డీకే శివకుమార్, మాజీ సీఎం సిద్ధరామయ్య ప్రయాణం- కాంగ్రెస్ హైకమాండ్తో కీలక భేటీలకు అవకాశం- 20 మంత్రి పదవులు ఖాళీ- ఆశావహుల్లో పెరిగిన ఉత్కంఠ కర్ణాటక రాజకీయాల్లో కేబినెట్ విస్తరణ అంశం మరోసారి హాట్ టాపిక్గా మారింది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దిల్లీ పర్యటనతో రాష్ట్ర కాంగ్రెస్లో మంత్రి పదవులపై చర్చలు మళ్లీ ఊపందుకున్నాయి. చాలా కాలంగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానం త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో మంత్రి పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న ఎమ్మెల్యేల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. బుధవారం సాయంత్రం దిల్లీకి వెళ్లిన డీకే శివకుమార్, కేంద్ర మంత్రులతో భేటీ అవుతారని అధికారిక షెడ్యూల్లో పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం ఆయన పార్టీ అగ్రనేతలతో కూడా సమావేశమయ్యే అవకాశముంది. ఇటీవలే కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ హైకమాండ్ అపాయింట్మెంట్ కోసం ఎదురుచూస్తున్నట్లు శివకుమార్ వెల్లడించారు. అధిష్ఠానం సమయం ఇచ్చిన వెంటనే దిల్లీకి వెళ్తానని ఆయన పేర్కొన్నారు. దిల్లీ పర్యటనకు ముందు డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఆయన నివాసంలో కలిసి చర్చలు జరపడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను శివకుమార్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. కేబినెట్ విస్తరణకు సంబంధించిన అంశాలపైనే ఇద్దరు నేతల మధ్య చర్చలు జరిగాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. భారీ సంఖ్యలో ఖాళీలు ఇదే సమయంలో సిద్ధరామయ్య కూడా దిల్లీకి వెళ్లనున్నట్లు ఆయన కుమారుడు, రాష్ట్ర మంత్రి యతీంద్ర సిద్ధరామయ్య వెల్లడించారు. కేబినెట్ విస్తరణను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పార్టీ భావిస్తోందన్నారు. రాజ్యసభ, శాసన మండలి ఎన్నికల కారణంగా ఈ ప్రక్రియ ఆలస్యమైందని చెప్పారు. ఇప్పుడు హైకమాండ్ రాష్ట్ర నాయకులను చర్చలకు పిలిచిందని,

# వృద్ధులకు గొడుగులు పంపిణీ





**గోకవరం,జులై 15 .అక్షర టైమ్స్ :** గోకవరం మండలం బావాజీ పేట లేఅవుట్ కాలనీలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్),ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ లలిత మెమోరియల్ ఫౌండేషన్ సహకారంతో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పి చిన్ని కుమార్తె లలిత వీరవేణి పదకొండవ వర్ధంతి సందర్భంగా గోకవరం మండలం భావాజీపేట లేఅవుట్ కాలనీలో వృద్ధులకు గొడుగులు పంపిణీ చేసారు,అనంతరం మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పీఎంపీ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు,పీ దేవానందం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా కోశాధికారి డాక్టర్ జి మహాలక్ష్మి లు హాజరైనారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు,వృద్ధులకు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు,నిరుపేదలకు అందించే సేవలే సంతృప్తినిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ గోకవరం మండల అధ్యక్షుడు, జిల్లా కోశాధికారి పి చిన్ని,కార్యదర్శి ఎస్ సూరిబాబు, కోశాధికారి జి లాజర్, సహాయ కార్యదర్శి గంటి వెంకటేష్,ములగాడ శ్రీను, ఎమ్ మల్లేష్, ఐ నాగేశ్వరరావు,గౌరి,దమ్ము వెంకటరమణ, శీలం వెంకటేష్,వి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కంటిపాప శాన్వికకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తల్లిదండ్రులు శివ - మానస యాదవ్




**గోపనపల్లి,జులై 15 .అక్షర టైమ్స్ : -ప్రతినిధి ఎం.ఈరన్న** ప్రతి తల్లిదండ్రుల జీవితంలోనూ పిల్లల పుట్టినరోజు అనేది ఒక పెద్ద పండుగ. ఆ రోజంతా ఇంట్లో పసిపాప నవ్వులు, సందడి నిండిపోతాయి. నేడు ఎడమ శాన్విక యాదవ్ పుట్టినరోజు సందర్భంగా ఆమె నివాసంలో పండుగ వాతావరణం నెలకొంది. తమ అపురూపమైన చిరునవ్వుల రాకుమారి శాన్వికకు తల్లిదండ్రులు శివ యాదవ్, మానస యాదవ్ ఎంతో ప్రేమతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

**మా ఇంటి వెలుగు.. మా శాన్విక**

"నువ్వు మా జీవితంలోకి అడుగుపెట్టిన రోజు మాకు కలిగిన ఆనందం మాటల్లో చెప్పలేనిది. నీ ప్రతి చిన్న నవ్వు మా శ్రమనంతా దూరం చేస్తుంది. మా ఇంట వెలుగులు నింపిన మా బుజ్జి బంగారానికి జన్మదిన శుభాకాంక్షలు" అంటూ తల్లిదండ్రులు శివ యాదవ్, మానస యాదవ్ భావోద్వేగానికి లోనయ్యారు.

**నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో**

శాన్విక భవిష్యత్తులో ఎంతో గొప్ప స్థాయికి ఎదగాలని, చదువులోనూ, జీవితంలోనూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.ఆ దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ మా అమ్మాయిపై ఉండాలని, తను నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఎనలేని సంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అని తల్లిదండ్రులు శివ యాదవ్ మానస యాదవ్

**బంధుమిత్రుల శుభాకాంక్షలు**

చిన్నారి శాన్విక యాదవ్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు శ్రేయోభిలాషులు ఆమెకు పెద్ద ఎత్తున జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నారు. పాప ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ, అందరి ఇళ్లల్లో ఆనందాన్ని నింపాలని ఆశీర్వదిస్తున్నారు.

## తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్

# సమావేశంలో ఐలాపూర్ మాణిక్ యాదవ్

**స్థానిక న్యాయవాదుల హక్కుల కోసం ఐలాపూర్ మాణిక్ యాదవ్ గళం**







**హైదరాబాద్,జులై 15 .అక్షర టైమ్స్ : ప్రతినిధి ఎం.వీరేష్** హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. సురేందర్ రెడ్డి సారథ్యంలో జరిగిన కీలక సమావేశంలో హైకోర్టు న్యాయవాది ఐలాపూర్ మాణిక్ యాదవ్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయవ్యవస్థలో తెలంగాణకు దక్కాల్సిన ప్రాధాన్యంపై ఈ వేదికగా విస్తృత చర్చ జరిగింది. న్యాయమూర్తుల నియామకాలు, ప్రభుత్వ న్యాయవాదులు మరియు అదనపు ప్రభుత్వ న్యాయవాదుల ఎంపికలో తెలంగాణ ప్రాంతానికి చెందిన అర్హులైన న్యాయవాదులకు సముచిత స్థానం కల్పించాలని ఈ సమావేశంలో సీనియర్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. స్థానిక న్యాయవాదుల హక్కులను కాపాడటంలో రాజీ పడకూడదని, రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్, యువ న్యాయవాదులతో పాటు ఐలాపూర్ మాణిక్ యాదవ్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. తెలంగాణ న్యాయవాదుల అవకాశాల పరిరక్షణ దిశగా తీసుకునే ఏ పోరాటానికైనా తాము సిద్ధమని న్యాయవాద వర్గాలు స్పష్టం చేశాయి.

అక్షర టైమ్స్

# విద్యార్థులకు రాజ్యాంగం, ఓటు హక్కుపై అవగాహన..

## నారాయణ స్కూల్లో మాక్ ఎలక్షన్

**పొదలకూరు,జులై 15 .అక్షర టైమ్స్ : రిపోర్టర్ ఆనంద్** విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు భారత రాజ్యాంగం, ఎన్నికల వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు పొదలకూరులోని నారాయణ స్కూల్లో బుధవారం మాక్ ఎలక్షన్ నిర్వహించారు. ఎన్నికల సంఘం నిర్వహించే ఎన్నికలను పోలిన విధంగా అన్ని దశలను చేపట్టి, ఎలక్ట్రానిక్ విధానంలో ఓటింగ్ నిర్వహించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని పొదలకూరు హౌసింగ్ ఏఈ మహేష్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమ



రాజ్యాంగాల్లో ఒకటని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి




ఓటు ఎంతో విలువైనదని, ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని విద్యార్థులకు వివరించారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల ప్రక్రియను చిన్న వయస్సులోనే అర్థం చేసుకోవడం ద్వారా విద్యార్థులు మంచి పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. అనంతరం ఎన్నికల సంఘం నిర్వహించే ఎన్నికలను పోలిన విధంగా నామినేషన్ల స్వీకరణ, ప్రచారం, ఎలక్ట్రానిక్ ఓటింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వంటి అన్ని దశలను విద్యార్థులతో నిర్వహించారు. విద్యార్థులు ఓటర్లుగా పాల్గొని ఎలక్ట్రానిక్ విధానంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావన, ప్రజాస్వామ్య విలువలు పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై ప్రత్యక్ష అనుభవాన్ని అందించడంతో పాటు భవిష్యత్తులో చైతన్యవంతమైన, బాధ్యతగల ఓటర్లుగా ఎదగడానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గిడియాన్, ఏజీఎం రఘురాం, కోఆర్డినేటర్ ప్రసన్న, ఏవో రామ్మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ లక్ష్మీప్రసన్న, నీలిమ, సునీల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మరో వారం వరకు వర్షాలు కురవడం కష్టమే!

మళ్లీ క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఈ నెల 20 వరకు బలమైన వేడిగాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ

28 జిల్లాల్లో లోటు వర్షపాతమే - హనుమకొండలో అత్యధికంగా 68శాతం

మహబూబ్‌నగర్‌లో 38.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

తెలంగాణ తాజా వాతావరణ సమాచారం



రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు క్రమంగా పెరిగిపోతుండగా మరోవైపు ఎండలు దంచి కొడుతున్నాయి. కొద్ది రోజులుగా మోస్తరు వర్షాలతో వాతావరణం కాస్త చల్లబడి ఉపశమనం లభించగా, ఇటీవల నమోదవుతున్న ఉష్ణోగ్రతలు మళ్లీ వేసవిని తలపిస్తున్నాయి. దీనికి తోడు మరో వారం రోజుల దాకా వానలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ ప్రకటించింది. బలమైన ఉపరితల గాలులు వీయడంతో ఈ నెల 20 వరకు వర్షాభావ పరిస్థితులే ఉండొచ్చని తెలిపింది. ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన వానల్లోనూ 28 జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైందని తాజాగా వ్యవసాయ శాఖ వెల్లడించింది. కేవలం 5 జిల్లాల్లో మాత్రమే సాధారణ స్థాయిలో వర్షాలు కురిశాయని తెలిపింది. ఈ మేరకు మంగళవారం సర్కారుకు నివేదిక అందించింది. అప్పుడప్పుడు కురిసిన జల్లులతో కాస్త ఉపశమనం లభించిన ప్రజలకు మళ్లీ ఎండ సెగ పెరుగుతోంది. దీంతో మళ్లీ ఏసీలు, కూలర్లకు పని చెప్పక తప్పడం లేదు. మంగళవారం రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక్కడ సాధారణం కన్నా 6.8 డిగ్రీలు పెరిగి, 38.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తర్వాత ఖమ్మంలో 36.4 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35.6 డిగ్రీల సెల్సియర్ మేరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జూన్ నెలారంభం నుంచి జులై 14 వరకు రాష్ట్రంలో సగటున కురవాల్సిన వానలు లోటు వర్షపాతంతోనే కొనసాగుతున్నాయి. ఈ ఏడాది వానాకాలానికి సంబంధించి జూన్ ఒకటి నుంచి జులై 14 వరకు సుమారు 31 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇంతవరకు సగటున 228 మిల్లీ మీటర్ల వర్షానికిగాను 158.4 మిల్లీ మీటర్లు మాత్రమే వానలు పడ్డాయి. సగటు వర్షపాతానికి దరిదాపుల్లో కొన్ని జిల్లాల్లో మాత్రమే వర్షాలు కురిశాయి. ఈ జాబితాలో అధికంగా ములుగు, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, సూర్యాపేట, నల్గొండ జిల్లాలున్నాయి. ఆయా జిల్లాల్లో మరో రెండు మూడు రోజులపాటు వానలు పడలేందటే అవి కూడా సగటు కంటే దిగువ వర్షపాత జిల్లాల కోవలోకే చేరతాయి. రాష్ట్రవ్యాప్తంగా అత్యల్ప వర్షాలు కురుస్తుండగా హనుమకొండ జిల్లాలో దారుణంగా వర్షపాతం లోటు నమోదైంది. ఈ వానాకాలానికి సంబంధించి ఇంతవరకు ఈ జిల్లాలో సగటున 247 మిల్లీ మీటర్ల మేర వానలు కురవాల్సి ఉండగా కేవలం 87 మిల్లీ మీటర్లతో ఏకంగా 64 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాల వారీగా చూస్తే తర్వాత స్థానంలో మేడ్చల్‌లో 56.54 శాతం లోటు నమోదైంది. వరుసగా వరంగల్ 55.23 శాతం, జోగులాంబ గద్వాల 48.35, నిజామాబాద్‌లో 47.54 శాతాల లోటు వర్షపాతం నమోదైంది. వనపర్తి జిల్లాలో 46.51 శాతం, యాదాద్రి భువనగిరిలో 43.24, జగిత్యాలలో 40.35 శాతాల లోటు నమోదు కాగా, 39 నుంచి 20 శాతం లోటు వర్షపాతంతో మిగిలిన జిల్లాలున్నాయి.

# ఓటర్ల జాబితా పునర్విమర్శ ప్రక్రియను విజయవంతం

బోనకల్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని

పరిశీలించిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు

ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా

చర్యలు తీసుకోవాలి -- లింగాల కమల్ రాజు





**బోనకల్,జులై 15 .అక్షర టైమ్స్ :** బోనకల్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర పునర్విమర్శ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. బోనకల్‌లోని వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏలు)తో సమావేశమై కార్యక్రమం పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా ఇంటింటికీ వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలని, అర్హుల పేర్లు నమోదు చేయడం, అనర్హుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించడం అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఓటర్ల జాబితా సక్రమంగా ఉండటం వల్ల ఎన్నికల ప్రక్రియ మరింత విశ్వసనీయంగా సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొంటున్న బీఎల్ఓలు, బీఎల్ఏలు ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని సూచించారు. ప్రజలు కూడా ఈ ప్రత్యేక పునర్విమర్శ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచూసుకొని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని అన్నారు. ప్రత్యేక పునర్విమర్శ కార్యక్రమంలో అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ఎవరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం బోనకల్ మండల మాజీ జెడ్పిటిసి బానోతు కొండ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిన విలువైన హక్కు అని, అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై ఓటర్ల జాబితాను మరింత పకడ్బందీగా రూపొందించేందుకు సహకరించాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పారా ప్రసాద్, నాగేశ్వరావు, బంధం నాగేశ్వరావు, ఇటుకల శ్రీను, వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.


# పోలవరానికి పర్యాటక శోభ

గోదావరి ఒడ్డున మెగా టూరిజం హబ్

ఇరిగేషన్, టూరిజం శాఖ అధికారులతో సీఎం సమావేశం

పోలవరం ప్రాజెక్టు సమీపంలో నదికి ఇరువైపులా పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుపై చర్చ

నిప్పాన్ కోయి ప్రతినిధుల ప్రజంటేషన్




ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా పేరొందిన పోలవరం ప్రాజెక్టు ఇకపై కేవలం సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాకుండా రాష్ట్ర పర్యాటక రంగానికి సరికొత్త గుర్తింపును తీసుకురానుంది. గోదావరి నదీ పరీవాహక ప్రాంత సహజసిద్ధమైన అందాలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వైభవం, పాపికొండల ప్రకృతి సోయగాలను సమన్వయం చేస్తూ ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ ప్రణాళికలపై ప్రత్యేక దృష్టి సారించడం ప్రాజెక్టుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తోంది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, టూరిజం శాఖల ఉన్నతాధికారులు, ప్రణాళికా సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పోలవరం అభివృద్ధి అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గోదావరి నదికి ఇరువైపులా ఆధునిక రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, పర్యాటకులకు ఆకర్షణీయమైన వాకింగ్ ట్రాక్‌లు, వీక్షణ వేదికలు, ల్యాండ్‌స్కేపింగ్, ప్రాజెక్టు స్పిల్‌వే ప్రాంత సుందరీకరణ, ఆధునిక సందర్శకుల కేంద్రాలు, పార్కింగ్, విశ్రాంతి కేంద్రాలు, ఫుడ్ కోర్టులు వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటుపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలవరం వద్ద నిర్మించనున్న ప్రతిష్ఠాత్మక కేబుల్ బ్రిడ్జ్ డిజైన్లను కూడా ముఖ్యమంత్రికి వివరించారు. పర్యాటక రంగంలో అంతర్జాతీయ అనుభవం కలిగిన నిప్పాన్ కోయి సంస్థ ప్రతినిధులు పోలవరం పరిసర ప్రాంతాల్లో సుమారు 1,500 ఎకరాల్లో అభివృద్ధి చేయదగిన పర్యాటక ప్రాజెక్టులపై సమగ్ర ప్రతిపాదనలు సమర్పించారు. ఇంజినీరింగ్ టూరిజం, రివర్‌ఫ్రంట్ టూరిజం, అడ్వెంచర్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్, క్రూయిజ్ బోటింగ్, ఎకో టూరిజం, ప్రకృతి వీక్షణ కేంద్రాలు, కుటుంబ వినోద పార్కులు వంటి అంశాలకు ఈ ప్రాంతం ఎంతో అనుకూలమని వారు పేర్కొన్నారు. గోదావరి నది వైభవం, పోలవరం నిర్మాణ అద్భుతం, పరిసర ప్రాంతాల సహజ అందాలు దేశ విదేశాల నుంచి పెద్దఎత్తున పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సమావేశంలో ముఖ్యమంత్రి 'అఖండ గోదావరి' అనే భావనతో ఈ ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం తక్షణమే సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి దశలవారీగా అమలు చేయడానికి చర్యలు ప్రారంభించాలని సూచించారు. పోలవరం పర్యాటక ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణా, హస్తకళలు, చిన్న వ్యాపారాలు, స్థానిక ఉత్పత్తులకు కొత్త మార్కెట్ లభించే అవకాశం ఉంది. దీంతో గోదావరి పరివాహక ప్రాంత ఆర్థిక వ్యవస్థకు కొత్త బలం చేకూరనుంది. సాగునీరు, విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను నెరవేర్చడంతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా పోలవరాన్ని కేంద్రబిందువుగా నిలపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం



# ఎస్ఐఆర్-2026 ఓటరు జాబితా భవిష్యత్తులోనూ కీలకమే

తర్వాత చూద్దాం అనుకుంటే ఇబ్బందులే

ఎస్ఐఆర్-2002లో ఓటర్లకు పెద్దగా లేని అవగాహన

ప్రస్తుతం వారి సంతానానికి తప్పని ఇబ్బందులు

ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే ఎస్ఐఆర్

2026లో ఎన్యూమరేషన్ ఫారం నింపాలంటున్న అధాకారులు



ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రస్తుతం తెలంగాణలో కొనసాగుతోంది. జులై 24వ తేదీ వరకు ఎన్యూమరేషన్ పత్రాన్ని సంబంధిత బీఎల్‌వోలకు ఇవ్వాలని ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్యూమరేషన్ పత్రం నింపడంలో అలసత్వం, తర్వాత చూసుకోవచ్చులే అని లైట్ తీసుకుంటే మాత్రం భవిష్యత్తులో అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఎస్ఐఆర్-2026 ఓటర్ల జాబితా రాబోయే రోజుల్లో మరింత కీలకంగా మారనుంది. కొత్త ఓటరుగా నమోదుకు, భవిష్యత్తులో నిర్వహించే ఎస్ఐఆర్‌కు ఈ జాబితానే ప్రాతిపదికగా తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సవరణ ప్రక్రియలో ఎస్ఐఆర్-2002 జాబితాతో వివరాలను లింక్ చేస్తున్నారు. అప్పటి జాబితాలో తమ పేర్లు, తల్లిదండ్రుల పేర్లు లేకపోవడంతో పత్రాలు నింపడంలో పలువురికి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ వివరాలు లేకుండా ఎన్యూమరేషన్ ఫారాలను నింపితే తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన గుర్తింపు కార్డుల్లో ఒకటి తప్పకుండా చూపించాల్సి ఉంటుంది. ఎస్ఐఆర్-2002లో ఈ కార్యక్రమంపై అప్పట్లో ఓటర్లకు పెద్దగా అవగాహన లేదు. దీంతో చాలా మంది 2002లో ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇప్పుడు వారి పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. భవిష్యత్తు తరాలు ఓటరు గుర్తింపు కార్డు కోసం అవస్థలు పడకుండా ఉండాలంటే తప్పనిసరిగా ఎస్ఐఆర్-2026లో పేరు ఉండేలా చూసుకోవాలని ఎన్నికల సంఘం అధికారులు సూచిస్తున్నారు. సాధారణంగా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలంటే ఫారం-6 నింపి ప్రస్తుతం నివసిస్తున్న అడ్రస్, ఏదైనా గుర్తింపు కార్డు ధ్రువపత్రాలను సమర్పించాలి. రాష్ట్రంలో ప్రస్తుతం సర్ ప్రక్రియ కొనసాగుతుండటంతో కొత్త ఓటరు నమోదుకూ ఎస్ఐఆర్‌తో లింక్ పెట్టారు. ఫారం-6 నింపడంతోపాటు ఎస్ఐఆర్-2002తో కూడిన వివరాలతో డిక్లరేషన్ పత్రాన్ని సంబంధిత వ్యక్తులు అందించాల్సి ఉంటుంది. ఈ డిక్లరేషన్ పత్రంలో ప్రస్తుతం ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపిన విధంగానే తల్లిదండ్రులు, తాత, నానమ్మ పేర్లలో ఒకరి వివరాలను పూరించాల్సి ఉంటుంది. భవిష్యత్తులోనూ కొత్త ఓటర్ల నమోదుకు ఇదే పద్ధతిని అమలుచేసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. వేరే రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలో పేరు నమోదై ఉండి, ప్రస్తుతం తెలంగాణలో ఉద్యోగాలు, వ్యాపారం చేస్తూ నివాసం ఉంటున్నవారు చాలా మంది ఉన్నారు. వేరే రాష్ట్రంలో ఓటర్లుగా ఉండి చిరునామా మార్పులో భాగంగా ఫారం-8 నింపితే దాంతోపాటు ఎస్ఐఆర్ వివరాలతో కూడిన డిక్లరేషన్ ఫారాన్ని కూడా అందించాల్సి ఉంటుంది. అలా చేస్తేనే ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఓటు బదిలీ అవుతుందని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు ఎన్యూమరేషన్ పత్రాన్ని సమర్పించి ఓటు హక్కును కాపాడుకోవాలని ఓటర్లకు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీకి ఇంకా కేవలం పది రోజుల గడువు మాత్రమే ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారని, మంగళవారం సాయంత్రం నాటికి 1,66,70,610 (49.28 శాతం) మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకుని వివరాలను నమోదు చేసి తిరిగి బీఎల్‌వోలకు సమర్పించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3,38,21,554(99.99 శాతం) మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను అందించినట్లు తెలిపారు. ఇంకా ఇప్పటివరకు ఎన్యూమరేషన్ అప్లికేషన్లను బీఎల్‌వోలకు అందించనివారు ఉంటే వెంటనే పూర్తి చేసి ఇవ్వాలని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

# మీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం.. పూర్తిగా దగ్ధమైన ప్లాస్టిక్ గోడౌన్

రంగారెడ్డి జిల్లా మీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

పూర్తిగా దగ్ధమైన ప్లాస్టిక్ వేర్‌హౌస్

పక్క భవనాలకు కూడా వ్యాపించిన మంటలు

ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వెల్లడి

ప్రమాద కారణాలపై పోలీసుల దర్యాప్తు

రంగారెడ్డి జిల్లా మీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నందనవనం మెట్రో బార్ సమీపంలోని ఒక ప్లాస్టిక్ వేర్‌హౌస్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు భారీగా ఎగిసిపడటంతో గోడౌన్ పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న వెంటనే మూడు అగ్నిమాపక యంత్రాలు ఘటనాస్థలానికి చేరుకున్నాయి. గోడౌన్‌లో భారీగా ప్లాస్టిక్ సామగ్రి నిల్వ ఉండటంతో మంటలు తీవ్రరూపం దాల్చి, పక్కనే ఉన్న మరో గోడౌన్‌తో పాటు సమీప భవనాలకు కూడా వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మీర్‌పేట పోలీసులు సైతం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు ధ్రువీకరించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఈ ప్రమాదం వల్ల భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఘటనతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, అగ్నిప్రమాదానికి



# ప్రభుత్వ పాలనలో తెలుగు అమలుపై నివేదిక ఇవ్వండి

**రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ హైకోర్టు ఆదేశం**

**ప్రభుత్వ ఉత్తర్వులు, పాలనలో తెలుగు అమలుపై హైకోర్టు కీలక ఆదేశాలు**

**పూర్తి వివరాలతో స్థాయీ నివేదిక దాఖలు చేయాలని స్పష్టీకరణ**

**తెలుగు అనువాదానికి సాంకేతికతను వాడుకోవాలని ధర్మాసనం సూచన**




ప్రభుత్వ పాలనలో మాతృభాష తెలుగును అమలు చేసేందుకు తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) జారీ చేసేందుకు చేపట్టిన చర్యలపై పూర్తి వివరాలతో స్థాయీ నివేదిక (స్టేటస్ రిపోర్ట్) దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు విచారణను వాయిదా వేసింది.రాష్ట్రంలో అధికార భాషగా తెలుగు అమలుపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టులో విచారణ జరిగింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని విచారించింది. ఈ సందర్భంగా పాలనలో తెలుగు వినియోగంపై ప్రభుత్వానికి పలు కీలక ఆదేశాలు, సూచనలు జారీ చేసింది. తదుపరి విచారణ నిమిత్తం కేసును వాయిదా వేసింది.ప్రభుత్వ పాలన అంతా తెలుగులోనే సాగాలని కోరుతూ డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ 2021లో హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఏపీ అధికార భాషా చట్టం–1966 నిబంధనలను ప్రభుత్వం పక్కాగా అమలు చేసేలా ఆదేశాలివ్వాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాలనా భాషగా తెలుగు అమలు కోసం 1988లో జీవో 587, 2005లో జీవో 420 జారీ అయ్యాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ జీవోలను సరైన స్ఫూర్తితో అమలు చేసేలా చూడాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరగాలని అభ్యర్థించారు. జీవోలను సైతం తెలుగులో జారీచేసేలా ఆదేశించాలని విన్నవించారు. రాష్ట్రంలో 87 శాతం ప్రజలకు ఆంగ్ల భాష అర్థం కాదని పిటిషనర్ న్యాయస్థానానికి తెలిపారు. కానీ, ప్రభుత్వ కార్యకలాపాలు, జీవోలు అన్నీ ఇంగ్లీషులోనే ఇస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ వ్యాజ్యంపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు వినిపించారు. ప్రభుత్వ పాలనలో తెలుగును అమలు చేసే ప్రక్రియ కొనసాగుతోందని కోర్టుకు వివరించారు. జీవోలు, అధికారుల మధ్య జరిగే ఉత్తరప్రత్యుత్తరాల్లో తెలుగు వినియోగానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే పలు జీవోలను తెలుగులోకి తర్జుమా చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు చెప్పారు. అయితే, ఆంగ్లం నుంచి తెలుగులోకి తర్జుమా చేసేవారు తగినంత మంది అందుబాటులో లేరన్నారు. అనువాదకుల కొరత వల్లే ఈ ప్రక్రియలో కొంత జాప్యం జరుగుతోందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.ప్రభుత్వ న్యాయవాది వాదనలపై హైకోర్టు ధర్మాసనం స్పందించింది. అనువాదకుల కొరతను అధిగమిం చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది. ఇంగ్లీషు నుంచి తెలుగులోకి జీవోలను అనువాదం చేసుకునేందుకు ఆధునిక సాంకేతికతను (టెక్నాలజీ) విస్తృతంగా వినియోగించుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. అలా సాంకేతికత ద్వారా చేసిన అనువాదంలో తప్పులు దొర్లాయా లేదా అనే విషయాన్ని సరిచూసుకునేందుకు పరిశీలకులను నియమించుకోవాలని పేర్కొంది. ఈ మేరకు తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో స్థాయీ నివేదిక (స్టేటస్ రిపోర్టు) సమర్పించాలని ఆదేశించింది.

# ఏసీబీకి చిక్కిన హెచ్ఎండీఏ సీఈ బచ్చు రవిందర్

**రూ.100 కోట్ల అక్రమాస్తులు**

**ఆదాయానికి మించి రూ.9.24 కోట్ల ఆస్తులు**

**వాటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా**

**సోదాల అనంతరం రవీందర్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ**



తెలంగాణలో ఏసీబీ అవినీతి అధికారులపై పంజా విసురుతోంది. ఈ క్రమంలోనే మరో అధికారి చిక్కారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హెచ్ఎండీఏ (హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్‌పై ఫిర్యాదులు రావడంతో ఏసీబీ నిఘా పెట్టింది. కొంతకాలంగా ఏసీబీ దూకుడు పెంచగా ఈ నెల 2న డీఎస్పీ భీంరెడ్డి ఉదంతం వెలుగు చూసిన తెలిసిందే. తాజాగా మంగళవారం తెల్లవారుజామున గచ్చిబౌలి సుమధుర ఆక్రోపొలిస్ గేటెడ్ కమ్యూనిటీలోని రవీందర్ ఇంటికి ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీఖాన్ నేతృత్వంలోని టీం చేరుకొని ముమ్మర సోదాలు చేసింది. హెచ్ఎండీఏ ఆఫీస్‌తోపాటు రవీందర్ సన్నిహితులు, బినామీలు, బంధువులు, సన్నిహితుల ఇళ్లు సహా మరో 9 ప్రాంతాల్లోనూ ఏకకాలంలో సోదాలు జరిగాయి. ఈ క్రమంలో రవీందర్ అధీనంలో ఉన్న చర, స్థిరాస్తులకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హెచ్ఎండీఏ విధుల్లో ఉన్నప్పుడు అక్రమార్జనతో కొనుగోలు చేసిన ఇళ్లు, వాణిజ్య, వ్యవసాయ స్థలాలను గుర్తించారు. రిజిస్ట్రేషన్ విలువ ప్రకారమే వాటి విలువ ఏకంగా రూ.9.24 కోట్లు అని నిర్ధారించగా బహిరంగ మార్కెట్‌లో రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని భావిస్తున్నారు. 18 రకాల విదేశీ మద్యం బాటిళ్లు కూడా లభించడంతో అబ్కారీ అధికారులకు సమాచారం అందజేశారు. సోదాల అనంతరం బచ్చు రవీందర్‌ను అరెస్ట్ చేసినట్లు ఏసీబీ ప్రకటించింది.హెచ్ఎండీఏలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) నుంచి చీఫ్ ఇంజినీర్ (సీఈ) వరకు దాదాపు మూడు దశాబ్దాల కాలంలో రవీందర్ కీలక పోస్టింగ్‌లలో వ్యవహరించారు. పలు ముఖ్యమైన ప్రాజెక్టుల నిర్మాణంలో కాంట్రాక్టర్ల నుంచి లంచాల రూపంలో అడ్డగోలుగా సంపాదించినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. హెచ్ఎండీఏకు తలమానికంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను సుమారు రూ.6,600 కోట్లతో నిర్మించిన సమయంలో పలు హోదాల్లో పనిచేసిన ఆయన బాగానే డబ్బు దండుకున్నారన్న ప్రచారం ఉంది. ఓఆర్ఆర్ ఎలివేటెడ్ కారిడార్ల టెండర్ల ప్రక్రియలో సీఈ హోదాలో ఉండటంతోపాటు ఓఆర్ఆర్‌ను 30 ఏళ్లపాటు ఓ ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చే విషయంలో ఆయనే కీలకంగా వ్యవహరించినట్లు హెచ్ఎండీఏలోనే గుసగుసలు వినబడుతున్నాయి. అలాగే తరచూ జరిగే ఓఆర్ఆర్ నిర్మాణ, మరమ్మతుల్లోనూ చేతివాటం ప్రదర్శించారన్న విషయాలు కూడా తెలుస్తున్నాయి. రవీందర్‌తోపాటు ఆయన కుటుంబసభ్యుల పేర్ల మీదుగా మొత్తం నాలుగు బ్యాంకు లాకర్లున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. మంగళవారం సోదాల సమయంలోనే రవీందర్ పేరిట ఉన్న లాకర్‌ను తెరవగా దాదాపు కిలోకుపైగా బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఆయన భార్య, కొడుకు, కోడలు పేరిట ఉన్న మరో మూడు లాకర్లను ఒకట్రెండు రోజుల్లో తెరుస్తామని ఏసీబీ చెబుతోంది. అవి కూడా బయటపడితే రవీందర్ ఆస్తుల విలువ మరింతగా ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు.

**గుర్తించిన ఆస్తులు :**

కొండాపూర్ మజీద్‌బండలో 300 చదరపు గజాల్లో జీ ప్లస్ 4 అంతస్తులతో నిర్మించిన సుమారు రూ.3 కోట్ల విలువైన వాణిజ్య భవనం.

శంషాబాద్, కొత్తూరు మండలాల్లో రూ.6 లక్షల విలువైన 4 ఎకరాల వ్యవసాయ భూములు.

శంకర్‌పల్లి మండలం మోకిలలోని శ్రీవారి మెడోస్‌లో 300 చదరపు గజాల్లో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న రూ.1.33 కోట్ల విలువైన విల్లా.

నార్సింగి, నానక్‌రాంగూడల్లో రూ.2.07 కోట్ల విలువైన నాలుగు రెసిడెన్షియల్ ఫ్లాట్లు

కొండకల్, కిష్టాపూర్, పసుమాములల్లో రూ.38.89 లక్షల విలువైన ఐదు ప్లాట్లు.

రూ.1.16 కోట్ల విలువైన 4 కార్లు.

రూ.3.82 లక్షల నగదు, రూ.45.05 లక్షల బ్యాంకు బ్యాలెన్స్.

రూ.36.7 లక్షల విలువైన దాదాపు 1,440 గ్రాముల బంగారు ఆభరణాలు.

రూ.10 లక్షల విలువైన 12.5 కిలోల వెండి ఆభరణాలు.

రూ.17.24 లక్షల విలువైన గృహోపకరణాలు.

రూ.9.32 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు.

అవినీతి అనకొండలకు ఏసీబీ చెక్ : ఇటీవల కాలంలో ఏసీబీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇటీవల డీఎస్పీ భీంరెడ్డి, ఈఎన్సీ మోహన్ నాయక్, జలమండలి జీఎం అనంత లక్ష్మి కుమార్, అబ్కారీ ఎస్పీ మల్లారెడ్డి, ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరిరావును ఏసీబీ అరెస్ట్ చేసింది. వీరి వ్యక్తిగత ఆస్తులు సుమారు రూ.100 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు ఉన్నాయి. వీటిని ఏసీబీ సీజ్ చేసింది.


# ఎస్ఐఆర్-2026 ఓటరు జాబితా భవిష్యత్తులోనూ కీలకమే

**తర్వాత చూద్దాం అనుకుంటే ఇబ్బందులే**

**ఎస్ఐఆర్-2002లో ఓటర్లకు పెద్దగా లేని అవగాహన**

**ప్రస్తుతం వారి సంతానానికి తప్పని ఇబ్బందులు**

**ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే ఎస్ఐఆర్ 2026లో ఎన్యూమరేషన్ ఫారం నింపాలంటున్న అధాకారులు**



ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రస్తుతం తెలంగాణలో కొనసాగుతోంది. జులై 24వ తేదీ వరకు ఎన్యూమరేషన్ పత్రాన్ని సంబంధిత బీఎల్‌వోలకు ఇవ్వాలని ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్యూమరేషన్ పత్రం నింపడంలో అలసత్వం, తర్వాత చూసుకోవచ్చులే అని లైట్ తీసుకుంటే మాత్రం భవిష్యత్తులో అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఎస్ఐఆర్-2026 ఓటర్ల జాబితా రాబోయే రోజుల్లో మరింత కీలకంగా మారనుంది. కొత్త ఓటరుగా నమోదుకు, భవిష్యత్తులో నిర్వహించే ఎస్ఐఆర్‌కు ఈ జాబితానే ప్రాతిపదికగా తీసుకుంటారని అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం జరుగుతున్న సవరణ ప్రక్రియలో ఎస్ఐఆర్-2002 జాబితాతో వివరాలను లింక్ చేస్తున్నారు. అప్పటి జాబితాలో తమ పేర్లు, తల్లిదండ్రుల పేర్లు లేకపోవడంతో పత్రాలు నింపడంలో పలువురికి ఇక్కట్లు తప్పడం లేదు. ఈ వివరాలు లేకుండా ఎన్యూమరేషన్ ఫారాలను నింపితే తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన గుర్తింపు కార్డుల్లో ఒకటి తప్పకుండా చూపించాల్సి ఉంటుంది.ఎస్ఐఆర్-2002లో ఈ కార్యక్రమంపై అప్పట్లో ఓటర్లకు పెద్దగా అవగాహన లేదు. దీంతో చాలా మంది 2002లో ఎస్ఐఆర్ ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇప్పుడు వారి పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. భవిష్యత్తు తరాలు ఓటరు గుర్తింపు కార్డు కోసం అవస్థలు పడకుండా ఉండాలంటే తప్పనిసరిగా ఎస్ఐఆర్-2026లో పేరు ఉండేలా చూసుకోవాలని ఎన్నికల సంఘం అధికారులు సూచిస్తున్నారు.సాధారణంగా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలంటే ఫారం-6 నింపి ప్రస్తుతం నివసిస్తున్న అడ్రస్, ఏదైనా గుర్తింపు కార్డు ధ్రువపత్రాలను సమర్పించాలి. రాష్ట్రంలో ప్రస్తుతం సర్ ప్రక్రియ కొనసాగుతుండటంతో కొత్త ఓటరు నమోదుకూ ఎస్ఐఆర్‌తో లింక్ పెట్టారు. ఫారం-6 నింపడంతోపాటు ఎస్ఐఆర్-2002తో కూడిన వివరాలతో డిక్లరేషన్ పత్రాన్ని సంబంధిత వ్యక్తులు అందించాల్సి ఉంటుంది. ఈ డిక్లరేషన్ పత్రంలో ప్రస్తుతం ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపిన విధంగానే తల్లిదండ్రులు, తాత, నానమ్మ పేర్లలో ఒకరి వివరాలను పూరించాల్సి ఉంటుంది. భవిష్యత్తులోనూ కొత్త ఓటర్ల నమోదుకు ఇదే పద్ధతిని అమలుచేసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.వేరే రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలో పేరు నమోదై ఉండి, ప్రస్తుతం తెలంగాణలో ఉద్యోగాలు, వ్యాపారం చేస్తూ నివాసం ఉంటున్నవారు చాలా మంది ఉన్నారు. వేరే రాష్ట్రంలో ఓటర్లుగా ఉండి చిరునామా మార్పులో భాగంగా ఫారం-8 నింపితే దాంతోపాటు ఎస్ఐఆర్ వివరాలతో కూడిన డిక్లరేషన్ ఫారాన్ని కూడా అందించాల్సి ఉంటుంది. అలా చేస్తేనే ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఓటు బదిలీ అవుతుందని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు.రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు ఎన్యూమరేషన్ పత్రాన్ని సమర్పించి ఓటు హక్కును కాపాడుకోవాలని ఓటర్లకు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీకి ఇంకా కేవలం పది రోజుల గడువు మాత్రమే ఉందని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారని, మంగళవారం సాయంత్రం నాటికి 1,66,70,610 (49.28 శాతం) మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకుని వివరాలను నమోదు చేసి తిరిగి బీఎల్‌వోలకు సమర్పించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3,38,21,554(99.99 శాతం) మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను అందించినట్లు తెలిపారు. ఇంకా ఇప్పటివరకు ఎన్యూమరేషన్ అప్లికేషన్లను బీఎల్‌వోలకు అందించనివారు ఉంటే వెంటనే పూర్తి చేసి ఇవ్వాలని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

# మీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం.. పూర్తిగా దగ్ధమైన ప్లాస్టిక్ గోడౌన్

**రంగారెడ్డి జిల్లా మీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం**

**పూర్తిగా దగ్ధమైన ప్లాస్టిక్ వేర్‌హౌస్**

**పక్క భవనాలకు కూడా వ్యాపించిన మంటలు**

**ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వెల్లడి**

**ప్రమాద కారణాలపై పోలీసుల దర్యాప్తు**

రంగారెడ్డి జిల్లా మీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నందనవనం మెట్రో బార్ సమీపంలోని ఒక ప్లాస్టిక్ వేర్‌హౌస్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు భారీగా ఎగిసిపడటంతో గోడౌన్ పూర్తిగా దగ్ధమైంది.సమాచారం అందుకున్న వెంటనే మూడు అగ్నిమాపక యంత్రాలు ఘటనాస్థలానికి చేరుకున్నాయి. గోడౌన్‌లో భారీగా ప్లాస్టిక్ సామగ్రి నిల్వ ఉండటంతో మంటలు తీవ్రరూపం దాల్చి, పక్కనే ఉన్న మరో గోడౌన్‌తో పాటు సమీప భవనాలకు కూడా వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మీర్‌పేట పోలీసులు సైతం ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు.ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు ధ్రువీకరించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఈ ప్రమాదం వల్ల భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఘటనతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.



# మరో వారం వరకు వర్షాలు కురవడం కష్టమే!

**మళ్లీ క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**

**ఈ నెల 20 వరకు బలమైన వేడిగాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ**

**28 జిల్లాల్లో లోటు వర్షపాతమే - హనుమకొండలో అత్యధికంగా 68శాతం**

**మహబూబ్‌నగర్‌లో 38.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు**

**తెలంగాణ తాజా వాతావరణ సమాచారం**



రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు క్రమంగా పెరిగిపోతుండగా మరోవైపు ఎండలు దంచి కొడుతున్నాయి. కొద్ది రోజులుగా మోస్తరు వర్షాలతో వాతావరణం కాస్త చల్లబడి ఉపశమనం లభించగా, ఇటీవల నమోదవుతున్న ఉష్ణోగ్రతలు మళ్లీ వేసవిని తలపిస్తున్నాయి. దీనికి తోడు మరో వారం రోజుల దాకా వానలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ ప్రకటించింది. బలమైన ఉపరితల గాలులు వీయడంతో ఈ నెల 20 వరకు వర్షాభావ పరిస్థితులే ఉండొచ్చని తెలిపింది. ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన వానల్లోనూ 28 జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైందని తాజాగా వ్యవసాయ శాఖ వెల్లడించింది. కేవలం 5 జిల్లాల్లో మాత్రమే సాధారణ స్థాయిలో వర్షాలు కురిశాయని తెలిపింది. ఈ మేరకు మంగళవారం సర్కారుకు నివేదిక అందించింది.అప్పుడప్పుడు కురిసిన జల్లులతో కాస్త ఉపశమనం లభించిన ప్రజలకు మళ్లీ ఎండ సెగ పెరుగుతోంది. దీంతో మళ్లీ ఏసీలు, కూలర్లకు పని చెప్పక తప్పడం లేదు. మంగళవారం రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక్కడ సాధారణం కన్నా 6.8 డిగ్రీలు పెరిగి, 38.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తర్వాత ఖమ్మంలో 36.4 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35.6 డిగ్రీల సెల్సియర్ మేరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జూన్ నెలారంభం నుంచి జులై 14 వరకు రాష్ట్రంలో సగటున కురవాల్సిన వానలు లోటు వర్షపాతంతోనే కొనసాగుతున్నాయి.ఈ ఏడాది వానాకాలానికి సంబంధించి జూన్ ఒకటి నుంచి జులై 14 వరకు సుమారు 31 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇంతవరకు సగటున 228 మిల్లీ మీటర్ల వర్షానికిగాను 158.4 మిల్లీ మీటర్లు మాత్రమే వానలు పడ్డాయి. సగటు వర్షపాతానికి దరిదాపుల్లో కొన్ని జిల్లాల్లో మాత్రమే వర్షాలు కురిశాయి. ఈ జాబితాలో అధికంగా ములుగు, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, సూర్యాపేట, నల్గొండ జిల్లాలున్నాయి. ఆయా జిల్లాల్లో మరో రెండు మూడు రోజులపాటు వానలు పడలేదంటే అవి కూడా సగటు కంటే దిగువ వర్షపాత జిల్లాల కోవలోకే చేరతాయి.రాష్ట్రవ్యాప్తంగా అత్యల్ప వర్షాలు కురుస్తుండగా హనుమకొండ జిల్లాలో దారుణంగా వర్షపాతం లోటు నమోదైంది. ఈ వానాకాలానికి సంబంధించి ఇంతవరకు ఈ జిల్లాలో సగటున 247 మిల్లీ మీటర్ల మేర వానలు కురవాల్సి ఉండగా కేవలం 87 మిల్లీ మీటర్లతో ఏకంగా 64 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాల వారీగా చూస్తే తర్వాత స్థానంలో మేడ్చల్‌లో 56.54 శాతం లోటు నమోదైంది. వరుసగా వరంగల్ 55.23 శాతం, జోగులాంబ గద్వాల 48.35, నిజామాబాద్‌లో 47.54 శాతాల లోటు వర్షపాతం నమోదైంది. వనపర్తి జిల్లాలో 46.51 శాతం, యాదాద్రి భువనగిరిలో 43.24, జగిత్యాలలో 40.35 శాతాల లోటు నమోదు కాగా, 39 నుంచి 20 శాతం లోటు వర్షపాతంతో మిగిలిన జిల్లాలున్నాయి.

# పోలవరానికి పర్యాటక శోభ

**గోదావరి ఒడ్డున మెగా టూరిజం హబ్**

**ఇరిగేషన్, టూరిజం శాఖ అధికారులతో సీఎం సమావేశం**

**పోలవరం ప్రాజెక్టు సమీపంలో నదికి ఇరువైపులా పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుపై చర్చ**

**నిప్పాన్ కోయి ప్రతినిధుల ప్రజంటేషన్**




ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా పేరొందిన పోలవరం ప్రాజెక్టు ఇకపై కేవలం సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాకుండా రాష్ట్ర పర్యాటక రంగానికి సరికొత్త గుర్తింపును తీసుకురానుంది. గోదావరి నదీ పరీవాహక ప్రాంత సహజసిద్ధమైన అందాలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వైభవం, పాపికొండల ప్రకృతి సోయగాలను సమన్వయం చేస్తూ ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ ప్రణాళికలపై ప్రత్యేక దృష్టి సారించడం ప్రాజెక్టుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తోంది.ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, టూరిజం శాఖల ఉన్నతాధికారులు, ప్రణాళికా సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పోలవరం అభివృద్ధి అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గోదావరి నదికి ఇరువైపులా ఆధునిక రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, పర్యాటకులకు ఆకర్షణీయమైన వాకింగ్ ట్రాక్‌లు, వీక్షణ వేదికలు, ల్యాండ్‌స్కేపింగ్, ప్రాజెక్టు స్పిల్‌వే ప్రాంత సుందరీకరణ, ఆధునిక సందర్శకుల కేంద్రాలు, పార్కింగ్, విశ్రాంతి కేంద్రాలు, ఫుడ్ కోర్టులు వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటుపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలవరం వద్ద నిర్మించనున్న ప్రతిష్ఠాత్మక కేబుల్ బ్రిడ్జ్ డిజైన్లను కూడా ముఖ్యమంత్రికి వివరించారు.పర్యాటక రంగంలో అంతర్జాతీయ అనుభవం కలిగిన నిప్పాన్ కోయి సంస్థ ప్రతినిధులు పోలవరం పరిసర ప్రాంతాల్లో సుమారు 1,500 ఎకరాల్లో అభివృద్ధి చేయదగిన పర్యాటక ప్రాజెక్టులపై సమగ్ర ప్రతిపాదనలు సమర్పించారు. ఇంజినీరింగ్ టూరిజం, రివర్‌ఫ్రంట్ టూరిజం, అడ్వెంచర్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్, క్రూయిజ్ బోటింగ్, ఎకో టూరిజం, ప్రకృతి వీక్షణ కేంద్రాలు, కుటుంబ వినోద పార్కులు వంటి అంశాలకు ఈ ప్రాంతం ఎంతో అనుకూలమని వారు పేర్కొన్నారు. గోదావరి నది వైభవం, పోలవరం నిర్మాణ అద్భుతం, పరిసర ప్రాంతాల సహజ అందాలు దేశ విదేశాల నుంచి పెద్దఎత్తున పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉన్నాయని అభిప్రాయపడ్డారు.సమావేశంలో ముఖ్యమంత్రి 'అఖండ గోదావరి' అనే భరావనతో ఈ ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం తక్షణమే సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి దశలవారీగా అమలు చేయడానికి చర్యలు ప్రారంభించాలని సూచించారు. పోలవరం పర్యాటక ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణా, హస్తకళలు, చిన్న వ్యాపారాలు, స్థానిక ఉత్పత్తులకు కొత్త మార్కెట్ లభించే అవకాశం ఉంది. దీంతో గోదావరి పరివాహక ప్రాంత ఆర్థిక వ్యవస్థకు కొత్త బలం చేకూరనుంది. సాగునీరు, విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను నెరవేర్చడంతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా పోలవరాన్ని కేంద్రబిందువుగా నిలపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది.



# ఇమ్యూనిటీ పెరగాలంటే


**ఈ విటమిన్స్ తప్పనిసరంటున్న నిపుణులు!**

**విటమిన్లు మన శరీరానికి అత్యంత అవశ్యకమైన పోషకాలను అందిస్తాయంటున్న నిపుణులు**



రోగనిరోధక వ్యవస్థ పటిష్టంగా ఉండే వివిధ వైరస్‌లు, బ్యాక్టీరియాలు మన ఆరోగ్యంపై ఎలాంటి ప్రతికూల ప్రభావాన్నీ చూపలేవు. అయితే, రోగనిరోధక శక్తి దృఢంగా ఉండాలంటే.. మనం తీసుకునే ఆహారం చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు. కొన్ని విటమిన్లు ఉండే ఆహార పదార్థాల్ని రోజూ తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని సూచిస్తున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో విటమిన్ సి కీలక పాత్ర పోషిస్తుందని ఛీఫ్‌ఉశీఖుశ్రీ ాఱఅఎతీఖుతీఎ శీట వీవంఅఏఱఅవ పేర్కొంది. ఈ విటమిన్ లోపం ఉన్న వాళ్లు త్వరగా జబ్బు పడే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అందుకే, మనం రోజూ తీసుకునే ఆహారంలో విటమిన్ సి పుష్కలంగా లభించే నిమ్మకాయ, కమలాఫలం వంటి నిమ్మజాతి పండ్లను భాగం చేసుకోవడం చాలా మంచిదని సూచిస్తున్నారు. అలాగే పాలకూర, క్యాప్సికం వంటివి కూడా మెనూలో చేర్చుకోవాలని సలహా ఇస్తున్నారు.రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో విటమిన్ బి6 సహకరిస్తుందంటున్నారు నిపుణులు. కాబట్టి, ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే బి6 అధికంగా లభించే అరటిపండ్లు, బంగాళాదుంపలు, చికెన్, శనగలు వంటి ఆహార పదార్థాల్ని రోజువారీ మెనూలో భాగం చేసుకోవాలని పేర్కొంటున్నారు.విటమిన్ ఇ మన శరీరంలో ఒక శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. ఇది బ్యాక్టీరియా, వైరస్, ఇతర ఇన్ఫెక్షన్లతో సమర్థంగా పోరాడి.. మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపకుండా కాపాడుతుందని చెబుతున్నారు. అలాగే, ఈ విటమిన్ రోగనిరోధక వ్యవస్థను పటిష్టపరచడంలోనూ సహకరిస్తుందని పేర్కొంటున్నారు. కాబట్టి, ఇది ఎక్కువగా లభించే పొద్దుతిరుగుడు గింజలు, పల్లీలు, బాదం పప్పులు, పాలకూర, నట్స్ వంటివి రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని తెలియజేస్తున్నారు. విటమిన్ ఇ, జింక్, సెలీనియం అనేవి వైరల్ ఇన్ఫెక్షన్ నుంచి కోలుకోవడానికి సహాయపడతాయని ంఏఅవఅఏవంఱతీవఫ్ పేర్కొంది.ఈ విటమిన్‌లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయని నిపుణులు చెబుతున్నారు. అలాగే, విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి కూడా మంచిదంటున్నారు. పాలు, పెరుగు, గుడ్లు, సాల్మన్, మాకేరెల్ వంటి కొవ్వు చేపలు, చిలగడదుంపలు, క్యారెట్లు, పాలకూర, బ్రోకలీ వంటి కూరగాయలు వంటివాటిల్లో విటమిన్ ఎ లభిస్తుందని ఎశ్రీవజవశ్రీఖఅఎశ్రీఱఅఱఎ పేర్కొంది.రోగనిరోధక వ్యవస్థ చురుగ్గా పనిచేయడానికి, దాని రక్షణకు విటమిన్ డి ఎంతగానే తోడ్పడుతుందని తెలియజేస్తున్నారు. కాబట్టి, ఈ విటమిన్‌ను పొందడానికి ఉదయాన్నే ఎండలో 10 నుంచి 30 నిమిషాలపాటు గడపాలని పేర్కొంటున్నారు. అలాగే, ఇది అధికంగా లభించే చేపలు, కోడిగుడ్లు, పాలు వంటివి తక్కువగా తీసుకోవాలని తెలియజేస్తున్నారు. విటమిన్ డి వల్ల ఎముకలు కూడా దృఢంగా మారతాయని వివరిస్తున్నారు. రోగనిరోధక కణాల పెరుగుదల, పనితీరుకు కీలకమైనవిగా గుర్తించబడిన వాటిలో విటమిన్ సి, విటమిన్ డి, జింక్, సెలీనియం, ఐరన్, ప్రోటీన్ ఉన్నాయి.

## కిడ్నీలో రాళ్లా? నీళ్లు తాగితే సరిపోదు!



కిడ్నీలో రాళ్ల సమస్యను నివారించడానికి ఎక్కువగా నీళ్లు తాగాలనేది చాలా కాలంగా ఉన్న నమ్మకం. కానీ, ఇది మాత్రమే సరిపోదని ప్రఖ్యాత వైద్య పత్రిక 'ది లాన్సెట్'లో ప్రచురితమైన ఒక తాజా అధ్యయనం స్పష్టం చేస్తోంది. కేవలం నీళ్లు తాగడం కిడ్నీ రాళ్లను నివారించడానికి ఒక దివ్యౌషధం కాదని, దీనికి సమగ్రమైన విధానం అవసరమని ఈ నివేదిక తేల్చి చెప్పింది.గతంలో కిడ్నీలో రాళ్ల సమస్యను ఎదుర్కొన్న 1,600 మందిపై జరిపిన ఈ అధ్యయనం ప్రకారం, కేవలం ద్రవాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రాళ్లు మళ్లీ ఏర్పడటంలో పెద్దగా తగ్గుదల కనిపించలేదు. నీళ్లు తాగడంపై దృష్టి పెట్టడం కన్నా, రోజుకు కనీసం 2.5 లీటర్ల మూత్రం విసర్జించేలా చూసుకోవడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. మూత్రం లేత పసుపు రంగులో వస్తేనే శరీరానికి సరిపడా నీరు అందినట్లు లెక్క. భారత్ వంటి వేడి వాతావరణం ఉన్న దేశాల్లో చెమట ద్వారా ఎక్కువ నీరు బయటకు పోతుంది కాబట్టి, మరింత అధికంగా ద్రవాలు తీసుకోవాల్సి ఉంటుంది.నీటితో పాటు ఆహారపు అలవాట్లలో మార్పులు చాలా కీలకమని ఈ నివేదిక తేల్చింది. ముఖ్యంగా ఈ నాలుగు విషయాలపై దృష్టి పెట్టాలని సూచించింది:

1. ఉప్పు తగ్గించడం: ఆహారంలో సోడియం (ఉప్పు) ఎక్కువగా ఉంటే, మూత్రంలో కాల్షియం ఎక్కువగా విసర్జించబడి రాళ్లు ఏర్పడతాయి.
2. కాల్షియం తీసుకోవడం: కాల్షియం ఉన్న ఆహారాన్ని పూర్తిగా మానేయడం ప్రమాదకరం. పేగుల్లో ఆక్సలేట్‌లను బంధించడానికి తగినంత కాల్షియం అవసరం.
3. మాంసకృత్తుల నియంత్రణ: మాంసాహారం ఎక్కువగా తింటే యూరిక్ యాసిడ్ పెరిగి రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది.
4. ఆక్సలేట్ ఆహారాలు: పాలకూర, బీట్‌రూట్ వంటి అధిక ఆక్సలేట్ ఉన్న ఆహార పదార్థాలను పరిమితంగా తీసుకోవాలి.

జీవనశైలి మార్పులు పాటిస్తున్నా కూడా రాళ్లు పదేపదే వస్తుంటే వైద్యులను సంప్రదించడం తప్పనిసరి. అవసరాన్ని బట్టి వారు పొటాషియం సిట్రేట్, థయాజైడ్ డైయూరిటిక్స్, అల్లోప్యూరినాల్ వంటి మందులను సూచిస్తారు. కాబట్టి, కిడ్నీలో రాళ్ల నివారణకు కేవలం నీళ్లపైనే ఆధారపడకుండా, సరైన మూత్ర విసర్జన, ఆహార నియమాలు, బరువు నియంత్రణ వంటి సమగ్రమైన విధానాన్ని పాటించాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# ఇదే మంచి కాలం.. భారతావనిని చుట్టేసొద్దాం!



విభిన్నమైన భౌగోళిక ప్రాంతాలు, వాతావరణ మండలాలు, సంస్కృతులు, ఆహార విధానాలతో భారతదేశం వైవిధ్యభరితంగా ఉంటుంది. అసలు మన భూగ్రహానికి మన దేశం ఓ నఖలుగా సగర్వంగా చెప్పుకోవచ్చు. ఈ నేపథ్యంలో 2025 ఏడాదిలో కొత్తగా మన భారతావనిని సందర్శించండి. మనదేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షాలు కురుస్తాయి. మార్చి చివరి నుంచి మే వరకు ఎండలు మండుతుంటాయి. కాబట్టి అక్టోబర్ నుంచి మార్చి మధ్య కాలం భారతదేశంలో ఏ ప్రాంతాన్ని సందర్శించడానికైనా అత్యుత్తమమైన సమయం. హిమాలయాల్లో వేసవి విడుదులను సందర్శించడానికి ఏప్రిల్ నుంచి జూన్ నెల తొలివారం వరకు మంచి సమయం.

**బొంబాయి-గోవా**

ఈ రెండు ప్రాంతాలను ప్లాన్ చేసుకుంటే పందర్‌పుర్, తుల్జాపుర్, షిర్డీ, నాసిక్ లాంటి పుణ్యక్షేత్రాలతోపాటు మహారాష్ట్రుల కోటలు, అరేబియా సముద్రం అందాలు, గోవాలో పోర్చుగీసుల సాంస్కృతిక ఆనవాళ్లు, బొంబాయిలో బ్రిటిష్ కాలపు నిర్మాణాలను చూడొచ్చు.

**ఢిల్లీ-రాజస్థాన్**

ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాలను కలిపి ప్లాన్ చేసుకుంటే మంచిది. ఒకేసారి దేశ రాజధానితోపాటు, రాజస్థాన్‌లోని కోటలు, ఆగ్రాలోని తాజ్‌మహల్, మథుర, బృందావనంలో కృష్ణ పరమాత్ముడి మధురస్మృతులను నింపుకొని రావచ్చు.

**గుజరాత్‌జి**

సోమనాథ్ జ్యోతిర్లింగం, ద్వారక శ్రీకృష్ణ మందిరం, మహాత్మాగాంధీ పుట్టిన పోర్‌బందర్‌తోపాటు రాజధాని గాంధీనగర్, అహ్మద్‌నగర్, కచ్ ఉప్పు నేలలు, గిర్ సింహాల అడవి దర్శనీయ ప్రదేశాలు.

**కర్ణాటక-కేరళ**

బెంగళూరు, మైసూరు నగరాలు, కావేరీ నదితోపాటు కేరళలో పశ్చిమ కనుమల అందాలు, అరేబియా సముద్ర బీచ్‌లు, అనంతపద్మనాభ స్వామి దేవాలయం తదితరాలు, సముద్రపు కాల్వల్లో పడవ ప్రయాణాలు జీవితకాలపు జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.

**తమిళనాడుజి**

మిగిలిన దేశానికి భిన్నంగా తమిళనాడులో అక్టోబర్ డిసెంబర్ మధ్యలో వర్షాలు, తుపానులు వస్తాయి. మిగిలిన సమయంలో ఎప్పుడైనా ఈ రాష్ట్రాన్ని చుట్టేసిరావచ్చు. మహాబలిపురం, కంచి, తంజావూరు, మదురై, కన్యాకుమారి, ఊటీ ఇక్కడి ప్రసిద్ధ స్థలాలు.

**ఉత్తరప్రదేశ్-బిహార్**

అయోధ్య, ప్రయాగ త్రివేణి సంగమం, కాశీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని తీర్థయాత్ర స్థలాలు. బిహార్‌లో బుద్ధ భగవానుడు జ్ఞానోదయం పొందిన గయ, ఆయన జీవితంతో ముడిపడిన రాజ్‌గిర్, నలంద తదితర ప్రదేశాలు దర్శనీయాలు.

**ఒడిశా-పశ్చిమబెంగాల్**


ఒడిశా రాజధాని భువనేశ్వర్ దేవాలయాల నగరంగా ప్రసిద్ధి చెందింది. దగ్గర్లోనే పూరీ జగన్నాథ దేవాలయం, కోణార్క్ సూర్యదేవాలయం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి. బెంగాల్‌లో రాజధాని కోల్‌కతా నగరంతోపాటు శాంతినికేతన్, డార్జిలింగ్ చూడదగ్గ ప్రదేశాలు. హిమాలయాల ఒడిలో

ఒదిగిపోయిన సిక్కిం రాష్ట్రం డార్జిలింగ్‌కు దగ్గరే.

**ఈశాన్య భారతదేశం**

అసోంతో కలుపుకొని ఏడు రాష్ట్రాలు భాగంగా ఉండే ఈశాన్య దేశంలో కామాఖ్య దేవాలయం, బ్రహ్మపుత్ర నదిలో మజూలీ ద్వీపం, అరుణాచల్‌లో తవాంగ్‌లోయ మొదలైనవి చూడదగ్గ ప్రదేశాలు. ఢిల్లీతోపాటు చూడాలనుకుంటే పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, కశ్మీర్, లఢఖ్ ప్రాంతాలను కూడా పర్యాటక జాబితాలో చేర్చుకోవచ్చు. కేదార్‌నాథ్, బదరీనాథ్, గంగోత్రి, హరిద్వార్ తదితర ప్రదేశాలతో అలరారే దేవభూమి ఉత్తరాఖండ్ కూడా ఢిల్లీ ద్వారా వెళ్లగలిగే పర్యాటకుల స్వర్గధామమే.

# క్రాంతి వర్సెస్ కాంతి



రాత్రి తొమ్మిది కావొస్తున్నది. ఏదో కేసు ఫైల్ చూస్తున్నాడు ఇన్‌స్పెక్టర్ రుద్ర. ఇంతలో మొబైల్ మోగింది. 'సార్.. ఓఆర్‌ఆర్ మీద ఒక వ్యక్తి చనిపోయి ఉన్నాడు. మీరు త్వరగా రండి'.. ఫోన్‌లో అటునుంచి ఎవరో కంగారుపడుతూ చెప్పాడు. వివరాలు తీసుకొన్న రుద్ర సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకొన్నాడు. మృతుడి వయసు 20 ఏండ్లకు అటూ ఇటూగా ఉంటుంది. శరీరాన్ని ఏదో జంతువు రక్కిన గుర్తులు కూడా ఉన్నాయి. 'ఫోన్ చేసింది మీరేనా?' ఎదురుగా ఉన్న వ్యక్తిని ప్రశ్నించాడు రుద్ర. 'అవును సార్. నేనే మీకు ఫోన్ చేశా' సమాధానమిచ్చాడు అతను. 'మీ పేరు? ఈ టైమ్‌లో మీరు ఇక్కడేం చేస్తున్నారు? ఓఆర్‌ఆర్‌పై ఎందుకు ఆగినట్టు?' సూటిగా ప్రశ్నించాడు రుద్ర. 'సార్.. నా పేరు క్రాంతి. నేను కొత్తగా కొన్న నా ఎలక్ట్రిక్ కారులో వెళ్తున్నా. బ్యాటరీ డౌన్ కావడంతో కారు ఆగిపోయింది. చార్జింగ్ స్టేషన్లు కూడా దగ్గర్లో ఎక్కడా కనిపించలేదు. ఇంతలో ఎదురుగా రోడ్డు మీద జంతువు దేన్నో రక్కుతున్న శబ్దం వినిపించింది. ఏంటా అని కారు హెడ్‌లైట్లు ఆన్‌చేసి చూశా. ఎదురుగా శవం కనిపించింది. వెంటనే మీకు ఫోన్ చేశా' ఆందోళనతో క్రాంతి చెప్తూ పోయాడు. సరేనన్న రుద్ర.. క్రాంతి ఫోన్ నంబర్, ఇతర వివరాలు తీసుకొన్నాడు. ఇంతలో..'సార్.. ఇదేదో యాక్సిడెంట్ కేసులా కనిపిస్తుంది. పాపం కుర్రాడిది చిన్నవయసే' అంటూ బాధపడ్డాడు హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి. 'అవును బాబాయ్. చిన్నవయసే. కానీ, ఇది యాక్సిడెంట్ కేసులా కనిపించట్లేదు. నిజంగా యాక్సిడెంట్ జరిగితే ఓఆర్‌ఆర్ మీద వాహనాలు వచ్చే స్పీడ్‌కు డెడ్‌బాడీ పరిస్థితి ఇంకోలా ఉండేది. అయితే ఈ కుర్రాడి శరీరం మీద ఏ కుక్కనో, నక్కనో రక్కినట్టు కొన్ని గుర్తులు ఉన్నాయి తప్ప మరేం గాయాలు కనిపించట్లేదు. ఏదేమైనా, ఫోరెన్సిక్ రిపోర్ట్ వచ్చాక గానీ మరిన్ని విషయాలు తెలియవు' అన్నాడు రుద్ర. అవునన్నట్టు తలూపాడు రామస్వామి. 'సార్.. నాకు లేట్ అవుతుంది. నేను వెళ్లొచ్చా?' క్రాంతి అడిగాడు. 'బ్యాటరీ డౌన్ అయ్యి కారు చెడిపోయింది అన్నారుగా. ఎలా వెళ్తారు?' ప్రశ్నించాడు రుద్ర. 'ఏదైనా క్యాబ్ బుక్ చేసుకొని వెళ్తా' సమాధానమిచ్చాడు క్రాంతి. 'మరి కారు?' మళ్లీ ప్రశ్నించాడు రుద్ర. 'రేపు వచ్చి కారు తీసుకుపోతాను సార్' మళ్లీ బదులిచ్చాడు క్రాంతి. 'హత్య గురించి ఇంతరాత్రి పూట మాకు విలువైన సమాచారం ఇచ్చారు. మిమ్మల్ని ఒక్కరినే అలా ఎలా పంపిస్తాం? మరేంపర్లేదు. మిమ్మల్ని మా కానిస్టేబుల్స్ ఇంటి దగ్గర విడిచిపెడతార'ని రుద్ర క్రాంతికి చెప్పాడు. ఫోరెన్సిక్ రిపోర్ట్ రాకముందే, ఆ కుర్రాడిది హత్య అని రుద్ర ఎలా కనిపెట్టాడని రామస్వామిసహా మిగతా కానిస్టేబుల్స్ అందరూ ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఇంతలో 'నేను ఒంటరిగానే వెళ్తా సార్. పోలీసుల సాయం ఏమీ వద్దు' అంటూ కాస్త భయపడుతూ క్రాంతి అన్నాడు. 'ఎందుకు వద్దు?' గద్దించాడు రుద్ర. 'మాది పద్ధతిగల ఫ్యామిలీ సార్.. ఇంటికి పోలీసులు వస్తే, మా అమ్మానాన్న తట్టుకోలేరు' అన్నాడు క్రాంతి. 'మరి అంత పద్ధతిగల ఫ్యామిలీ నుంచి వచ్చిన నువ్వు.. ఈ కుర్రాడిని ఎందుకు చంపావ్?' బాంబు పేల్చాడు రుద్ర. ఒక్కసారిగా నిశ్శబ్ద వాతావరణం. 'సార్.. ఏం మాట్లాడుతున్నారు? యాక్సిడెంట్‌కు సంబంధించిన ఇన్ఫర్మేషన్ ఇవ్వడం కూడా తప్పేనా? అదే తప్పయితే ఇకపై ఎవరూ ఎవరికీ ఏ సాయం చేయరు. మానవత్వమే మంటగలిసిపోతుంది' అంటూ ఏడ్చినంత పని చేశాడు క్రాంతి. 'డియర్ క్రాంతి. ఈ సెంటిమెంటల్ డైలాగ్స్ ఇక ఆపడం నీకే బెటర్. ఈ హత్య నువ్వే చేశావని ఇప్పటికిప్పుడు నేను రుజువు చేయగలను. మర్యాదగా నువ్వే నిజం చెప్తే అది నీకే మంచిది' స్పష్టంగా అన్నాడు రుద్ర. కాస్త ఆలోచించాక.. ఏం పాలుపోని క్రాంతి.. ఆ హత్య తానే చేశానని ఒప్పేసుకొన్నాడు. అయితే ఆ కుర్రాడికి తనకు ఎలాంటి సంబంధంలేదని, తాను ఈ హత్య కావాలని చేయలేదని ఓ షాకింగ్ విషయం కూడా చెప్పాడు. అది విన్న రుద్ర అండ్ టీమ్‌కు ముచ్చెమటలు పట్టాయి. ఆ విషయం పక్కనబెడితే, క్రాంతినే ఆ కుర్రాడిని హత్య చేశాడని రుద్ర ఎలా కనిపెట్టాడు? ఓఆర్‌ఆర్‌పై పడివున్న కుర్రాడిని తానే హత్య చేశానని ఎట్టకేలకు ఒప్పుకొన్న క్రాంతి.. ఆ కుర్రాడికి తనకు ఎలాంటి సంబంధంలేదని, తాను ఈ హత్య కావాలని చేయలేదని చెప్పాడు. దీంతో మరెందుకు ఈ హత్య చేశావని ఇన్‌స్పెక్టర్ రుద్ర గద్దించాడు. దీనికి క్రాంతి స్పందిస్తూ.. 'సార్.. గత కొన్ని రోజులుగా నన్ను ఓ చీకటి శక్తి వెంటాడుతుంది. అది చెప్తేనే నేను ఈ అబ్బాయి మీదకు ఆ వాయువును వదిలా' అంటూ క్రాంతి చెప్తూ పోయాడు. ఆ మాటలు విన్న రుద్ర, హెడ్ కానిస్టేబుల్ రామస్వామి ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నారు. 'ఏం బాబూ.. మేం మీకు ఎలా కనిపిస్తున్నాం? లాఠీకి పని చెప్పించేలా ఉన్నావే..' అంటూ కాస్త కరువుగా అంటున్న రామస్వామిని వారించిన రుద్ర.. క్రాంతిని స్టేషన్‌కు తీసుకురమ్మని పురమాయించాడు. మరుసటి రోజు.. 'మిస్టర్ క్రాంతి. హత్య చేశానని ఒప్పేసుకొన్నావ్. అంతవరకూ ఓకే. అయితే, అసలు కారణం ఏమిటన్నది మాత్రం చెప్పకుండా ఏదేదో మాట్లాడుతున్నావ్. ఇది నీకు మంచిదికాదు' అంటూ గంభీరంగా అన్నాడు రుద్ర. 'సార్.. హత్య నేనే చేశా. అయితే, నాకు తెలియకుండానే అది జరిగిపోయింది. అసలు ఆ అబ్బాయి ఎవరో కూడా నాకు తెలియదు' క్రాంతి నిశ్చయంగా చెప్పాడు. 'తెలియని అబ్బాయిని ఎందుకు చంపావ్?' ప్రశ్నించాడు రుద్ర. 'చెప్పాను కదా సార్.. ఓ చీకటి శక్తి చెప్తేనే చేశా' మళ్లీ అదే చెప్పాడు క్రాంతి. దీంతో క్రాంతి అబద్ధమైనా చెప్తుండాలి లేదా మతి స్థిమితంగానైనా లేకుండా ఉండాలి అని రుద్ర మనసులో అనుకొంటూ ఉండగా కుర్రాడి పోస్ట్‌మార్టం రిపోర్ట్ వచ్చింది.

**సమాధానం :** క్రైమ్ స్పాట్‌కు వచ్చీరాగానే 'ఈ టైమ్‌లో ఓఆర్‌ఆర్‌పై ఏం చేస్తున్నారం'టూ క్రాంతిని రుద్ర ప్రశ్నించాడు. దానికి తాను ఓఆర్‌ఆర్ మీదుగా కారులో వెళ్తుండగా బ్యాటరీ డౌన్ కావడంతో కారు ఆగిపోయిందని క్రాంతి బదులిచ్చాడు. ఇంతలో ఎదురుగా రోడ్డు మీద జంతువు దేన్నో రక్కుతున్న శబ్దం వినిపించి కారు హెడ్‌లైట్లు ఆన్‌చేసి శవాన్ని చూసినట్టు చెప్పాడు. నిజానికి కారు బ్యాటరీ డౌన్ అయ్యాక, హెడ్‌లైట్లు కూడా ఆన్ కావు. ఈ చిన్న లాజిక్‌నే రుద్ర కనిపెట్టాడు. పక్కనే ఉన్న టోల్‌ప్లాజా నుంచి కారు దాటడం సీసీటీవీలో రికార్డు కావడంతో భవిష్యత్తులో ఈ హత్య తనమీదకు వస్తుందని భావించిన క్రాంతి.. తాను తప్పించుకోవడానికి ఏమీ తెలియనట్టు తానే పోలీసులకు సమాచారమిచ్చాడు. అయితే, కారు బ్యాటరీ డౌన్ అయిందని అబద్ధం చెప్పి దొరికిపోయాడు. కాగా.. క్రాంతి ఈ హత్యను ఎందుకు చేశాడు? ఒక్క గాయం కనిపించకుండా కుర్రాడిని ఎలా చంపాడు? దీని వెనుక కారణమేంటన్న విషయాలపై రుద్ర టీమ్ దర్యాప్తు మొదలుపెట్టింది.

# రేగుపండ్లు అంటే ఇష్టమా?



తీపి, పులుపు, వగరు కలగలిసిన రుచితో ఉండే రేగుపండ్లు అంటే అందరికీ ఇష్టమే. ఈ సీజన్‌లో ఎక్కడ చూసిన బండ్లపై కనిపిస్తుంటాయి. ఈ పండ్లు కేవలం రుచికరంగా ఉండటమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయంటున్నారు నిపుణులు. శరీరానికి కావాల్సిన పోషకాలు వీటిలో ఉంటాయని చెబుతున్నారు. ఈ క్రమంలో రేగుపండ్లు తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం!

**రోగనిరోధక శక్తికి :** ఇందులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయంటున్నారు నిపుణులు. దీంతో శరీరంలో ఉత్పత్తయ్యే హానికర ఫ్రీ రాడికల్స్‌ను తొలగించి ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెబుతున్నారు. అలాగే, ఇందులోని లిగ్నిన్ పీచు సైతం యాంటీఆక్సిడెంట్‌లా పనిచేసి రోగనిరోధక కణాల ఉత్పత్తికి తోడ్పడుతుందని తెలియజేస్తున్నారు. తద్వారా శరీరానికి వ్యాధుల మీద తిరగబడే శక్తి పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఈ రెండు గుణాలవల్ల రేగుపండు డయాబెటిస్, గుండెజబ్బుల నుంచి రక్షిస్తుందని చెబుతున్నారు. ఇంకా, జలుబూ, ఫ్లూ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తుందంటున్నారు.

**నిద్రకి :** రేగు పండ్లలో ఉండే 'శాపోనిన్' అనే పదార్థం మెదడును ప్రశాంతపరుస్తుందంటున్నారు నిపుణులు. ఇది సహజంగా నిద్ర పట్టేలా చేసి, నిద్రలేమి సమస్యను తగ్గిస్తుందని చెబుతున్నారు. ముఖ్యంగా, దీర్ఘకాలిక ఆందోళన, ఒత్తిడితో బాధపడేవాళ్లకి రేగుపండ్లు మంచి ఔషధమని సూచిస్తున్నారు. ఈ పండ్లతో మరిగించిన టీ తాగినా మంచిదంటున్నారు. చైనా, ఆసియాలోని ఇతర ప్రాంతాలలో రేగుపండ్లను నిద్రలేమి, ఆందోళన, మరిన్నింటికి నివారణగా చాలా కాలంగా ఉపయోగిస్తున్నారని ఎశ్రీవజవశ్రీఖఅఎశ్రీఱఅఱఎ అధ్యయనం పేర్కొంది.

**క్యాన్సర్లకి:** రేగులోని విటమిన్-సికి యాంటీ క్యాన్సర్ గుణాలు ఉన్నాయని అధ్యయనం పేర్కొంది. ఈ పండ్ల నుంచి తీసిన ఎక్స్‌ట్రాక్ట్‌ను పేగు, గర్భాశయ, అండాశయ, రొమ్ము, చర్మ, కాలేయ క్యాన్సర్ల నివారణలో వాడినప్పుడు.. ఆయా కణాలను నాశనం చేసినట్లు స్పష్టమైందట.జీర్ణసంబంధిత వ్యాధులకి: రేగు పండ్లలో అధికంగా ఉండే పీచు పొట్ట గోడల్ని సంరక్షిస్తుందని నిపుణులు చెబుతున్నారు. తద్వారా హానికర బ్యాక్టీరియా, అల్సర్ల నుంచి కాపాడుతుందంటున్నారు. ఈ పండు మంచి ప్రొబయోటిక్‌గానూ పనిచేసి, పొట్టలో మంచి బ్యాక్టీరియా పెరిగేలా చేస్తుందని పేర్కొంటున్నారు. ఫలితంగా, కడుపులో మంటని తగ్గిస్తుందని వివరిస్తున్నారు. వీటి రసం నోటి పుండ్లు, గొంతు మంటనీ నివారిస్తుందని తెలియజేస్తున్నారు. అంతేకాదు, ఈ పండ్లు ఆకలినీ తగ్గిస్తాయట. తద్వారా బరువుని నియంత్రించుకోవచ్చని అంటున్నారు.

**అందానికి :** రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు రేగుపండ్లలో ఉండటంతో చర్మ ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయంటున్నారు నిపుణులు. ఇవి ముఖంపై గీతలు, ముడతలను రానివ్వకుండా చర్మాన్ని మృదువుగా ఉంచుతాయని చెబుతున్నారు. అలాగే, ముందస్తు వృద్ధాప్య ఛాయలను దరికి చేరనీయవని తెలియజేస్తున్నారు. వీటిలోని పోషకాలు జుట్టు రాలకుండా కాపాడతాయని పేర్కొంటున్నారు.

**ఈ ప్రయోజనాలు కూడా! :**

రేగు పండ్లలో పొటాషియం, ఫ్లోరైడ్, ఇనుము పుష్కలంగా ఉంటుందని తీవంఖుతీఎష్ట్రస్త్రఫ్‌వ అధ్యయనం పేర్కొంది. పొటాషియం కణాలు, శరీర ద్రవాలలో ఒక ముఖ్యమైన భాగంగా ఉండి, హృదయ స్పందన రేటును, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుందని తెలిపింది.ఈ పండ్లలో సమృద్ధిగా ఉండే ఐరన్, ఫాస్పరస్‌లు రక్తకణ వృద్ధికి తోడ్పడటం ద్వారా రక్తహీనతనీ తగ్గిస్తాయి.ఆర్థరైటిస్ ఉన్నవారు ఈ పండ్లను తీసుకొంటే.. వీటిలోని కాల్షియం, ఫాస్పరస్ ఎముకలను దృఢంగా ఉంచుతాయని.. కీళ్లకు సంబంధించిన పలురకాల ఆరోగ్య సమస్యలకు ఈ పండు ఔషధంలా పనిచేస్తుందని అంటున్నారు. రేగు పండ్లలోని విటమిన్ సి , విటమిన్ కె, పొటాషియం వంటి పోషకాలు ఎముకలను బలపరుస్తాయని ఎశ్రీవజవశ్రీఖఅఎశ్రీఱఅఱఎ అధ్యయనం పేర్కొంది.రక్తప్రసరణ సజావుగా జరిగి ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు దరిచేరవు.కాలేయానికి సంబంధించిన సమస్యలకు దూరంగా ఉండొచ్చు.వీటిలోని పీచు జీర్ణాశయం పనితీరును మెరుగుపరిచి అజీర్తిని తగ్గిస్తుంది.గర్భిణులకెదురయ్యే వికారం, వాంతులు వంటి సమస్యలకు ఇది ఉపశమనాన్నిస్తుంది.మెనోపాజ్‌లోకి అడుగుపెట్టేటప్పుడు డి విటమిన్ తగ్గి ఎదురయ్యే కండరాల సమస్యలకు ఈ పండుతో చెక్ పెట్టొచ్చు. నెలసరిలో అధికస్రావాన్ని ఈ పండు తీసుకోవడం ద్వారా తగ్గించొచ్చని చెబుతున్నారు.

# ఈ-20 పెట్రోల్‌పై ఎన్డీఏ ఓటర్లకూ గుబులు!

**వాహనాలు పాడవుతాయని మెజారిటీ జనం భయం**

**'సీ-ఓటర్' సర్వేలో సంచలన విషయాల వెల్లడి**

**ఇథనాల్ కలిపిన ఈ-20 పెట్రోల్ వాడకానికి 55 శాతం మంది విముఖత**

**సొంత కూటమి ఎన్డీఏ మద్దతుదారుల్లోనూ 52.5 శాతం వ్యతిరేకత**

**ఈ-20 వల్ల మైలేజ్ తగ్గుతుందని 52.8 శాతం మంది నమ్మకం**

**వాహన ఇంజిన్లు దెబ్బతింటాయంటూ వాహనదారుల్లో తీవ్ర ఆందోళన**

**ధర తగ్గించినా ఇథనాల్ ఇంధనం వాడేందుకు జనం సముఖంగా లేరని వెల్లడి**



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానంపై దేశవ్యాప్తంగా వాహనదారుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కేంద్రంలోని అధికార ఎన్డీఏ కూటమిని సమర్థించే ఓటర్లు సైతం ఈ సరికొత్త ఇంధనాన్ని వాడేందుకు ఇష్టపడటం లేదని ప్రముఖ పరిశోధన సంస్థ 'సీ-ఓటర్' నిర్వహించిన తాజా సర్వేలో వెల్లడైంది. ఇథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల వాహనాల మైలేజ్ తగ్గడమే కాకుండా, ఇంజిన్లు దెబ్బతినే ప్రమాదం ఉందన్న ఆందోళన దేశ ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ఈ-20 పెట్రోల్ వల్ల నష్టపోయిన ఒక్కరినైనా చూపించాలంటూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల విమర్శకులకు సవాల్ విసిరారు. అయితే, దీనిపై నిరసనకారులు తక్షణమే స్పందించారు. ఒక్కరిని కాదు.. ఇథనాల్ పెట్రోల్ వాడి తమ వాహనాలు పాడైపోయాయని లబోదిబోమంటున్న ఆరుగురు బాధితులను మంత్రి ముందర నిలబెడతామని ప్రతిసవాల్ చేశారు. అయితే మీడియా ముందుకు వెళ్లేకంటే ముందే, ఈ విషయమై గడ్కరీ తమతో నేరుగా సమావేశం కావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ఇంధనం సురక్షితమేనని చెబుతున్నప్పటికీ, ముఖ్యంగా పాత వాహనాల యజమానులు ఈ విధానం వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు. సీ-ఓటర్ దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. దాదాపు 52.5 శాతం మంది ఎన్డీఏ మద్దతుదారులు తమ వాహనాల్లో ఈ-20 పెట్రోల్ వాడటానికి నిరాకరించగా, కేవలం 18.1 శాతం మంది మాత్రమే మొగ్గు చూపారు. ఇక ప్రతిపక్షాల మద్దతుదారుల్లో ఈ వ్యతిరేకత 57.9 శాతంగా ఉంది. మొత్తం మీద చూసుకుంటే దేశంలో 55.1 శాతం మంది వాహనదారులు ఈ ఇంధనానికి నో చెబుతున్నారు. ఇథనాల్ కలపడం వల్ల మైలేజ్ తగ్గుతుందని 52.8 శాతం మంది, అసలు వాహనాలే పాడైపోతాయని 54.2 శాతం మంది బలంగా నమ్ముతున్నారు. సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్ కలిపిన పెట్రోల్ ధర తక్కువగా ఉండాలని 74.5 శాతం మంది అభిప్రాయపడ్డారు. అయితే, ఒకవేళ ప్రభుత్వం ధర తగ్గించి అమ్మినా కూడా.. తాము ఈ-20 పెట్రోల్‌కు మారబోమని 40.4 శాతం మంది కుండబద్దలు కొట్టారు. అలాగే పెట్రోల్ బంకుల్లో ఇథనాల్ కలిపిన పెట్రోల్‌తో పాటు, పాత పద్ధతిలోని సాధారణ పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉంచాలని, దేన్ని వాడాలో ఎంచుకునే స్వేచ్ఛ కస్టమర్లకే వదిలేయాలని 75.9 శాతం మంది డిమాండ్ చేస్తున్నారు. ముడిచమురు దిగుమతులు తగ్గించుకోవడానికి కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాహనదారుల నమ్మకాన్ని గెలవడంలో ప్రభుత్వం వెనుకబడిందని ఈ సర్వే స్పష్టం చేస్తోంది.

## ఫ్రెషర్లకు షాక్.. హెచ్‌సీఎల్‌టెక్ నియామకాల్లో భారీ మార్పు!

**ఫ్రెషర్ల కంటే ప్రత్యేక నైపుణ్యాలున్న ఇంజనీర్లకే ప్రాధాన్యం**

**ఎంపికైన వారికి నాలుగు రెట్ల అధిక వేతనం**

**ఏఐ, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీపై ఫోకస్ , రెండేళ్లలో కొత్త బృందం ఏర్పాటు**




ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో ఐటీ రంగంలో నియామకాల తీరు వేగంగా మారుతోంది. ఈ నేపథ్యంలో దేశంలోని మూడో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్‌టెక్ కొత్త వ్యూహాన్ని అమలు చేయనుంది. ఇకపై పెద్ద సంఖ్యలో ఫ్రెషర్లను నియమించుకోవడం కంటే ప్రత్యేక నైపుణ్యాలున్న ఇంజినీర్లను ఎంపిక చేయడంపైనే దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించింది. అలాంటి వారికి సాధారణ ఫ్రెషర్లతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపింది. హెచ్‌సీఎల్‌టెక్ 'చీఫ్ పీపుల్ ఆఫీసర్' రామ్ సుందరరాజన్ ఈ విషయాన్ని వెల్లడించారు. రానున్న రెండు నుంచి మూడేళ్లలో ప్రత్యేక నైపుణ్యాలున్న ఇంజినీర్ల బృందాన్ని తయారు చేయనున్నట్లు చెప్పారు. వీరిని 'ఫార్వర్డ్ డిప్లాయిడ్ ఇంజినీర్లు'గా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. కస్టమర్ల వ్యాపార అవసరాలను అర్థం చేసుకుని ఏఐ ఆధారిత పరిష్కారాలను వేగంగా అందించే బాధ్యత వీరిపై ఉంటుందని వివరించారు. సంప్రదాయ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతో పోలిస్తే ఈ విభాగంలో పనిచేసే వారికి సాంకేతిక నైపుణ్యాలతో పాటు కస్టమర్లతో నేరుగా పనిచేసే సామర్థ్యం కూడా అవసరమని సంస్థ తెలిపింది. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా ఇంజినీరింగ్, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ వంటి రంగాల్లో నైపుణ్యాలు ఉన్నవారికే ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ ప్రత్యేక కార్యక్రమానికి ఎంపికైన వారికి సాధారణ ఫ్రెషర్ల వేతనంతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ ప్యాకేజీ ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఏఐ ప్రాజెక్టుల్లో చేరిన వెంటనే పనిచేయగలిగే ఉద్యోగులను సంస్థలు కోరుకుంటున్నాయని హెచ్‌సీఎల్‌టెక్ పేర్కొంది. దీంతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తీసుకుని తర్వాత శిక్షణ ఇవ్వడం కంటే, ముందుగానే నైపుణ్యాలు ఉన్న వారిని ఎంపిక చేసే విధానానికి ప్రాధాన్యం పెరుగుతోందని వివరించింది.

# భారత్‌లో గూగుల్ భారీ ఏఐ ప్రణాళికలు.. విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**భారత్‌లో పలు ఏఐ కార్యక్రమాలను ప్రకటించిన గూగుల్**

**విద్య, ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ రంగాలపై ప్రధానంగా దృష్టి**

**డెవలపర్ల కోసం డీప్‌మైండ్ ఉచిత ఏఐ శిక్షణా కార్యక్రమం**

**ఎయిమ్స్‌తో కలిసి ఆరోగ్య సంరక్షణపై కీలక పరిశోధనలు**

**25 భారతీయ భాషల్లో అందుబాటులోకి వచ్చిన జెమిని లైవ్**




అమెరికా టెక్నాలజీ దిగ్గజం గూగుల్, భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తన కార్యకలాపాలను భారీగా విస్తరిస్తున్నట్టు ప్రకటించింది. భారత డెవలపర్లు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకుని పలు కీలక కార్యక్రమాలను మంగళవారం ఆవిష్కరించింది. బెంగళూరులో జరిగిన 'గూగుల్ ఐ/ఓ కనెక్ట్ ఇండియా 2026' సదస్సులో ఈ ప్రకటనలు చేసింది. విద్య, ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో కొత్త ఏఐ ప్రోగ్రామ్‌లను ప్రారంభించనున్నట్టు వెల్లడించింది. ఈ కార్యక్రమానికి హాజరైన కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. భారత్‌లో ఇంటర్నెట్ సేవలను విస్తరించడంలో గూగుల్ కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. సెర్చ్, ఆండ్రాయిడ్, యూట్యూబ్, గూగుల్ పే వంటి ఉత్పత్తులతో కోట్ల మంది జీవితాల్లో మార్పు తెచ్చిందని అన్నారు. వ్యాపారాలు, ప్రభుత్వ సేవలు, విద్యా విధానంలో గూగుల్ అసాధారణమైన ఆవిష్కరణలు చేసిందని కొనియాడారు. ఈ సదస్సులో భాగంగా గూగుల్ పలు ముఖ్యమైన ప్రకటనలు చేసింది. గూగుల్ డీప్‌మైండ్, 'ఏఐ రీసెర్చ్ ఫౌండేషన్స్' పేరుతో 56 గంటల ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది. నాస్కామ్, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) భాగస్వామ్యంతో ఈ ప్రోగ్రామ్‌ను అందివ్వనుంది. దీని ద్వారా భారీ లాంగ్వేజ్ మోడళ్లను (ఎల్ఎల్ఎం) రూపొందించడంలో నిపుణులకు శిక్షణ ఇస్తారు. అలాగే, అటల్ ఇన్నోవేషన్ మిషన్ కింద ఉపాధ్యాయుల కోసం 'ఏటీఎల్ సారథి' అనే జెమిని ఆధారిత అసిస్టెంట్‌ను ప్రవేశపెట్టింది. ప్రాథమికంగా 100 పాఠశాలల్లో దీన్ని అమలు చేయనున్నారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో ఢిల్లీ ఎయిమ్స్ పరిశోధకులతో కలిసి పనిచేస్తున్నట్టు గూగుల్ తెలిపింది. తమ 'మెడ్‌జెమ్మా' ఓపెన్ ఏఐ మోడళ్లను ఉపయోగించి కుష్టు వ్యాధి, లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం వంటి అంశాలపై భారత్‌కు ప్రత్యేకమైన టూల్స్ అభివృద్ధి చేస్తున్నట్టు పేర్కొంది. వీటిని దేశంలోని డెవలపర్లందరికీ అందుబాటులో ఉంచుతామని వివరించింది. దీంతో పాటు, గూగుల్ 'జెమిని లైవ్' ఇప్పుడు సంస్కృతం, భోజ్‌పురి, మైథిలి సహా 25 భారతీయ భాషలు, మాండలికాలకు సపోర్ట్ చేస్తుందని వెల్లడించింది. ఇతర దేశాలతో పోలిస్తే భారత డెవలపర్లు ఏఐని అత్యంత వేగంగా వినియోగిస్తున్నారని గూగుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లోబానా తెలిపారు. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలను అందించడంపై దృష్టి సారించామని వివరించారు. 2025లో గూగుల్ ప్లే స్టోర్, ఆండ్రాయిడ్ ఎకోసిస్టమ్ ద్వారా భారత ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ. 5.3 లక్షల కోట్ల ఆదాయం సమకూరిందని, ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 28 శాతం అధికమని గూగుల్ పేర్కొంది.

## రెనో ట్రైబర్‌పై రూ.60,000 వరకు డిస్కౌంట్

**ఈ ఆఫర్ పరిమిత కాలానికేనన్న కంపెనీ , రాష్ట్రానికి బట్టి మారుతున్న డిస్కౌంట్లు**

**కేరళలో గరిష్ఠంగా రూ.60 వేల డిస్కౌంట్ , గుజరాత్‌లో రూ.45 వేల తగ్గింపు**

**మిగిలిన రాష్ట్రాల్లో గరిష్ఠంగా రూ.30 వేల రాయితీ**

**క్యాష్ డిస్కౌంట్‌తో పాటు ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపేజ్ బెనిఫిట్, లాయల్టీ, రిఫరల్, కార్పొరేట్ డిస్కౌంట్లు**



రెనో ఇండియా తన ట్రైబర్ ఎంపీవీపై ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. పరిమిత కాలానికి అందుబాటులో ఉండే ఈ ఆఫర్లలో భాగంగా, జులై నెలలో గరిష్ఠంగా రూ.60 వేల వరకు ప్రయోజనాలు పొందే అవకాశం కల్పించింది. అయితే రాష్ట్రం, వేరియంట్, మోడల్ ఇయర్, వినియోగదారుడి అర్హతను బట్టి డిస్కౌంట్ మొత్తం మారుతుందని కంపెనీ తెలిపింది. రెనో అధికారిక వివరాల ప్రకారం.. కేరళలో ట్రైబర్‌పై రూ.60 వేల వరకు, గుజరాత్‌లో రూ.45 వేల వరకు ప్రయోజనాలు లభిస్తాయి. ఇతర చాలా రాష్ట్రాల్లో గరిష్ఠంగా రూ.30 వేల వరకు ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్యాకేజీలో క్యాష్ డిస్కౌంట్‌తో పాటు ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపేజ్ బెనిఫిట్, లాయల్టీ, రిఫరల్, కార్పొరేట్ డిస్కౌంట్లు కూడా ఉండొచ్చు. రెనో ట్రైబర్ ధర ఎక్స్‌షోరూమ్‌లో రూ.5.81 లక్షల నుంచి రూ.8.48 లక్షల వరకు ఉంది. ఏడు సీట్ల సదుపాయం ఉండి, అత్యంత అందుబాటు ధరల్లో వస్తున్న బాగా చవక ఎంపీవీల్లో ఇదొకటి. ఇందులో 1.0 లీటర్, మూడు సిలిండర్ల పెట్రోల్ ఇంజిన్ ఉండగా, 5-స్పీడ్ మాన్యువల్ లేదా ఏఎంటీ గేర్‌బాక్స్ ఆప్షన్స్ లభిస్తాయి. మాన్యువల్ వేరియంట్‌కు లీటర్‌కు 20 కిలోమీటర్ల వరకు, ఏఎంటీ వేరియంట్‌కు 17 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఉందని కంపెనీ పేర్కొంది. వేరియంట్‌ను బట్టి ట్రైబర్‌లో 8 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, రియర్ ఏసీ వెంట్స్, పుష్ బటన్ స్టార్ట్, కీలెస్ ఎంట్రీ వంటి ఫీచర్లు ఉన్నాయి. భద్రత పరంగా ఆరు ఎయిర్‌బ్యాగులు, ఏబీఎస్, ఈబీడీ, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్, హిల్ స్టార్ట్ అసిస్ట్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, రివర్స్ కెమెరా వంటి ఫీచర్లను కూడా అందిస్తోంది.

# కొత్త ఈపీఎస్ స్కీమ్.. ఈ 5 బెనిఫిట్స్ గురించి తెలుసుకోండి!

**ఈపీఎస్ 2026 కింద చందాదారుల కుటుంబాలకు ఆర్థిక భద్రత**

**ఉద్యోగి మరణిస్తే వితంతు, పిల్లల, అనాథ పెన్షన్ల సౌకర్యం**

**1995 నాటి పథకం స్థానంలో అమల్లోకి వచ్చిన కొత్త పెన్షన్ స్కీమ్**

**నామినీ, ఆధారపడిన తల్లిదండ్రులకు కూడా పెన్షన్ ప్రయోజనాలు**

**కనీస నెలవారీ పెన్షన్ రూ. 1,000గా యథాతథం**




ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) చందాదారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా 'ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్) 2026' ఒక కీలక ముందడుగుగా నిలుస్తోంది. ఒకవేళ చందాదారుడు అకాల మరణం చెందితే, వారి కుటుంబ సభ్యులకు వితంతు, పిల్లల, అనాథ, నామినీ లేదా ఆధారపడిన తల్లిదండ్రుల పెన్షన్ రూపంలో తగిన ఆర్థిక సహకారాన్ని అందిస్తూ ఈపథకం అండగా నిలుస్తుంది. సోషల్ సెక్యూరిటీ కోడ్-2020లో భాగంగా ఈ నూతన ఈపీఎస్-2026 పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇది 2026 జూన్ చివరి నుంచి అమల్లోకి వచ్చింది. 1995 నాటి పాత పథకం స్థానంలో దీన్ని తీసుకువచ్చినప్పటికీ, కుటుంబ ప్రయోజనాలకు సంబంధించిన కీలక నిబంధనలను యథాతథంగా కొనసాగించారు. వ్యవస్థీకృత రంగంలోని లక్షలాది మంది కార్మికులు, వారి కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. 1. వితంతు పెన్షన్: అర్హులైన ఈపీఎస్ సభ్యుడు మరణించిన సందర్భంలో, వారి జీవిత భాగస్వామికి (భార్య/భర్త) జీవితాంతం లేదా వారు పునర్వివాహం చేసుకునే వరకు నెలవారీ పెన్షన్ లభిస్తుంది.

2. పిల్లల పెన్షన్: జీవిత భాగస్వామికి అందే పెన్షన్‌తో పాటు, గరిష్ఠంగా ఇద్దరు పిల్లలకు 25 ఏళ్లు నిండేవరకు అదనంగా పెన్షన్ అందిస్తారు. ఒకవేళ పిల్లలు శాశ్వత వైకల్యంతో బాధపడుతుంటే, వారికి జీవితాంతం ఈ ప్రయోజనం అందుతుంది.

3 అనాథ పెన్షన్: చందాదారుడికి జీవిత భాగస్వామి లేని పక్షంలో, పిల్లలకు అనాథ పెన్షన్ కేటాయిస్తారు. ఇది సాధారణ వితంతు పెన్షన్‌లో 75 శాతం వరకు ఉంటుంది.

4. నామినీ పెన్షన్: చందాదారుడు అవివాహితుడైనా లేదా పైన పేర్కొన్న అర్హులైన కుటుంబ సభ్యులు లేకపోయినా, వారు నామినేట్ చేసిన వ్యక్తికి ఈ పెన్షన్ ప్రయోజనం చేకూరుతుంది.

5. ఆధారపడిన తల్లిదండ్రులకు పెన్షన్: పైన పేర్కొన్న కేటగిరీలలో ఎవరూ లేనప్పుడు మాత్రం పైన తెలిపిన ఏ కేటగిరీలోనూ లబ్ధిదారులు లేని పక్షంలోనే, చందాదారుడిపై ఆధారపడిన తల్లిదండ్రులకు ఈ పెన్షన్ వర్తిస్తుంది. ఇందులో మొదట తండ్రికి, ఆ తర్వాత తల్లికి ప్రాధాన్యత ఉంటుంది.

ఈ పథకానికి అర్హత సాధించాలంటే ఉద్యోగి కనీసం ఒక నెల పాటు ఈపీఎఫ్ ఖాతాకు కంట్రిబ్యూట్ చేసి ఉండాలి. నూతన నిబంధనల ప్రకారం క్లెయిమ్ ప్రక్రియను వేగవంతం చేస్తూ, వ్యవస్థలో జవాబుదారీతనం పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

## ఆపిల్ ఐఫోన్ 17 నో స్టాక్... కారణం ఇదే!

**ధరలు పెరుగుతాయనే భయంతో భారత్‌లో ఐఫోన్ 17కు కొరత**

**ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్లలో వేగంగా అమ్ముడవుతున్న స్టాక్స్**

**మెమరీ చిప్‌ల వ్యయం పెరగడమే దీనికి ప్రధాన కారణం**

**ఇప్పటికే ధరలు పెంచిన శాంసంగ్, ఒప్పో, వివో వంటి సంస్థలు**

**ఇప్పుడే కొనాలంటూ కస్టమర్లకు రిటైలర్ల సలహా**



భారత మార్కెట్‌లో యాపిల్ ఐఫోన్ 17 మోడళ్లకు తీవ్ర కొరత నెలకొంది. సమీప భవిష్యత్తులో ధరలు పెరిగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో, వినియోగదారులు వీటి కొనుగోలుకు భారీగా మొగ్గు చూపుతుండటంతో ఈ పరిస్థితి తలెత్తింది. గత పది రోజులుగా ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు రిటైల్ స్టోర్లలోనూ ఐఫోన్ 17 బేస్ మోడల్ నిల్వలు వేగంగా నిండుకుంటున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ వెబ్‌సైట్లు, ఆఫ్‌లైన్ అవుట్‌లెట్‌లలో పలు వేరియంట్లు, కలర్ ఆప్షన్లు ఇప్పటికే 'అవుట్ ఆఫ్ స్టాక్'గా దర్శనమిస్తున్నాయి. మెమరీ చిప్‌ల ధరల పెరుగుదల దృష్ట్యా కొన్ని ఉత్పత్తుల ధరలను పెంచక తప్పడం లేదని యాపిల్ సీఈఓ టిమ్ కుక్ ఇటీవల సంకేతాలిచ్చారు. ఈ క్రమంలోనే కంపెనీ ఇప్పటికే ఐప్యాడ్, మ్యాక్ మోడళ్ల ధరలను సవరించింది. ప్రస్తుతానికి ఐఫోన్ ధరల్లో ఎలాంటి మార్పు చేయకపోయినప్పటికీ, భవిష్యత్తులో ఏ క్షణమైనా ధరలు పెరగొచ్చనే ఆందోళన వినియోగదారులను వెంటాడుతోంది. ఫలితంగా, ముందస్తుగానే ఫోన్లను కొనుగోలు చేసేందుకు వారు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ డేటా సెంటర్ల నుంచి డిమాండ్ పెరగడంతో మెమరీ, స్టోరేజ్ చిప్‌ల కొరత ఏర్పడింది. ఇదే తరుణంలో భారతదేశంలో శాంసంగ్, ఒప్పో, వివో, రియల్‌మీ వంటి సంస్థలు ఇప్పటికే తమ హ్యాండ్‌సెట్ల ధరలను పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, ఐఫోన్ 17 ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్న వినియోగదారులకు, ఇదే సరైన సమయమని రిటైలర్లు సూచిస్తున్నారు. యాపిల్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, మార్కెట్‌లో నెలకొన్న అంచనాలు, ఊహాగానాలే ప్రస్తుత కొరతకు ప్రధాన కారణమవుతున్నాయి.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు


**పశ్చిమాసియాలో పెరిగిన ఉద్రిక్తతల కారణంగా మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి**

**సెన్సెక్స్ 561 పాయింట్లు, నిఫ్టీ 159 పాయింట్లు నష్టపోయిన వైనం**

**భారీగా నష్టపోయిన పీఎస్‌యూ బ్యాంక్, రియల్టీ, ఆటో రంగాల షేర్లు**




దేశీయ స్టాక్ మార్కెట్లు నేడు భారీ నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. దీంతో అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి వెల్లువెత్తింది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ, ఆటో స్టాక్స్‌లో భారీగా నష్టాలు నమోదయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 561.46 పాయింట్లు నష్టపోయి 77,054.94 వద్ద స్థిరపడింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 159 పాయింట్లు క్షీణించి 24,052.05 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. కొన్ని రక్షణాత్మక రంగాల షేర్లు నిలదొక్కుకున్నప్పటికీ, కీలక రంగాల్లో అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి దారితీసింది. నిఫ్టీలో హెచ్‌సీఎల్ టెక్, శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ షేర్లు ఎక్కువగా నష్టపోయి సూచీపై భారం మోపాయి. ఈ బలహీనత బ్రాడర్ మార్కెట్లకు కూడా విస్తరించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.44 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.01 శాతం మేర నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే.. దాదాపు అన్ని సూచీలు నష్టాల్లోనే ట్రేడ్ అయ్యాయి. నిఫ్టీ రియల్టీ, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ఆటో అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. అయితే, ఈ ప్రతికూల ధోరణికి భిన్నంగా నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ లాభాలతో ముగిసింది. మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి కారణంగా ఇన్వెస్టర్లు ఫార్మా వంటి సురక్షిత రంగాల వైపు మొగ్గు చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కార్పొరేట్ ఫలితాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ ఉద్రిక్తతలు మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి.



# మధ్యతరగతి మందహాసాలు

శ్రీకాంత్, లయ నాయకానాయికలుగా రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మిస్టర్ మిడిల్‌క్లాస్'. జి.నాగేశ్వర రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం ట్రైలర్‌ను ఆవిష్కరించడంతో పాటు ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు వి.వి.వినాయక్, దశరథ్, రచయిత కోన వెంకట్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ .. మధ్యతరగతి కష్టాలను వినోదాత్మకంగా ఈ సినిమాలో చూపించారన్నారు. ఇందులో నటించిన ప్రతీ ఆర్టిస్టుతో గతంలో తాను సినిమాలు చేశానని, మళ్లీ వారందరితో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం పాత రోజులను గుర్తుకు తెచ్చిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమాలో తాను వెంకటేశ్వరస్వామి పాత్రను పోషించడం అదృష్టంగా భావిస్తున్నానని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ సినిమాతో శ్రీకాంత్ బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టబోతున్నారని, రాజేంద్రప్రసాద్ పాత్ర వెన్నెముకలా నిలిచిందని, ఆద్యంతం హాస్యభరితంగా సినిమా ప్రేక్షకుల్ని అలరిస్తుందని దర్శకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు

# చెన్నైకి మకాం మార్పు

కమల్‌హాసన్ ముద్దుల తనయ శృతిహాసన్ చెన్నైలో కొత్త ఇంటిలోకి అడుగుపెట్టింది. గృహ ప్రవేశానికి సంబంధించిన ఫొటోలను తన సోషల్‌మీడియా ఖాతాల ద్వారా పంచుకుంది. దాదాపు 40కోట్ల వ్యయంతో తన అభిరుచికి తగినట్లు శృతిహాసన్ ఇంటిని డిజైన్ చేసుకుందట. సోమవారం జరిగిన గృహ ప్రవేశ వేడుకలో ఆమె సోదరి అక్షరహాసన్‌తో పాటు కొద్దిమంది స్నేహితులు పాల్గొన్నారు. కెరీర్ ఆరంభం నుంచి దాదాపు పదిహేనేళ్లుగా ముంబయిలో నివాసం ఉంటున్నది శృతిహాసన్. అయితే గతకొంతకాలంగా బాలీవుడ్‌లో ఈ భామకు అవకాశాలు తగ్గాయి. వ్యక్తిగత జీవితంలో కూడా ఒడిదుడుకులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులకు దగ్గరగా ఉండాలనే ఉద్దేశ్యంలో తిరిగి చెన్నైకి మకాం మార్చిందని అంటున్నారు. ఇక నుంచి దక్షిణాది సినిమాలకే ప్రాధాన్యం ఇవ్వాలనే నిర్ణయం కూడా ఈ భామ చెన్నైకి షిఫ్ట్ కావడానికి ఓ కారణమని చెబుతున్నారు. ఇటీవలే 'పెద్ది' సినిమాలో ఐటెం సాంగ్‌లో మెరిసిన ఈ సొగసరి ప్రస్తుతం దుల్కర్ సల్మాన్‌తో కలిసి 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో నటిస్తున్నది.





# అతిథి పాత్రకు 15కోట్లు?

పారితోషికాల విషయంలో హీరోలతో పోటీపడుతూ తగ్గేదేలే అంటున్నారు అగ్ర కథానాయికలు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్స్ రెమ్యునరేషన్ కూడా రెండుమూడు కోట్లకు మించేది కాదు. కానీ ఇప్పుడు సినీ వ్యాపార సమీకరణాలు మారిపోయాయి. పాన్ ఇండియా ట్రెండ్‌తో పాటు నాయికా ప్రాధాన్యం ఉన్న చిత్రాలకు ఆదరణ పెరగడంతో హీరోయిన్స్ సైతం భారీ పారితోషికాలను డిమాండ్ చేస్తున్నారు. దక్షిణాదితో పాటు హిందీలో అగ్ర కథానాయికలు పదికోట్లకు పైగా రెమ్యునరేషన్ అందుకోవడం సాధారణంగా మారింది. అయితే బాలీవుడ్ భామ అలియాభట్ అతిథి పాత్రకోసమే 15కోట్ల రెమ్యునరేషన్ స్వీకరించి ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. హిందీ సూపర్‌హిట్ హారర్ ఫిల్మ్ 'తుంబాడ్'కు సీక్వెల్ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. సోహమ్‌షా హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి అనిల్ బార్వే దర్శకుడు. ఇందులో అలియా కీలకమైన అతిథి పాత్రను పోషిస్తున్నది. కేవలం పదినిమిషాల నిడివిగల ఈ పాత్ర కోసం మేకర్స్ అలియాభట్‌కు 15 కోట్ల రెమ్యునరేషన్‌ను ఆఫర్ చేశారని తెలిసింది. పాన్ ఇండియా స్థాయిలో అలియాభట్‌కు ఉన్న క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకొని ఆమె కోరినంత పారితోషికాన్ని ఇచ్చారని బాలీవుడ్ ట్రేడ్‌వర్గాల్లో వినిపిస్తున్నది. త్వరలో ఈ సినిమా సెట్స్‌లో అలియాభట్ జాయిన్ కానుంది. ఈ సీక్వెల్‌లో నవాజుద్దీన్ సిద్ధికీ సైతం ఓ హీరోగా నటిస్తున్నారు. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది.



# పోలీస్ పాత్రలో కొత్త సినిమా?

'కేజీఎఫ్' ఫ్రాంచైజీతో దేశవ్యాప్తంగా మంచి పాపులారిటీ సంపాదించుకున్నారు కన్నడ అగ్ర హీరో యశ్. ఆయన తాజా చిత్రం 'టాక్సిక్' ఆగస్ట్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. దీనితో పాటు బాలీవుడ్ 'రామాయణ'లో కూడా యశ్ నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత యశ్ చేయబోయే ప్రాజెక్ట్ ఏంటన్నది ఆసక్తికరంగా మారింది. తాజా సమాచారం ప్రకారం 'సప్త సాగరదాచే ఎల్లో' (తెలుగులో 'సప్తసాగరాలు దాటి') చిత్రంతో కన్నడంలో మంచి గుర్తింపును సంపాదించుకున్నారు దర్శకుడు హేమంత్ ఎమ్ రావ్. ఆయన దర్శకత్వంలో యశ్ తన తదుపరి సినిమా చేయబోతున్నారని కన్నడ ఫిల్మ్‌వర్గాల్లో వినిపిస్తున్నది. ఇందులో యశ్ పోలీస్ పాత్రలో కనిపించబోతున్నారని, సామాజిక అంశాల చుట్టూ అల్లుకున్న ఈ కథలో ఆయన ఫెరోషియస్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారని సమాచారం. పాన్ ఇండియా స్థాయిలో కరణ్‌జోహార్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారని తెలిసింది. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

EDITOR, PRINTER AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri -515411,Anantapur District Andra Pradesh,Published at #1/111, SC PETA,RAMPAYARRAM PALEM,GOKARAM (V&P),GOKARAM (M), GOKARAM.EAST GODAVARI-533286Andra Pradesh EDITOR B.JAVEED BASHA PRGI. NO : APTEL/26/A4786, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com